ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 28 సంచిక : 9 మే 2023

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2


భక్తికి ఫలం నరసింహావతారం .................................... 27

అక్షరమణమాల ................................................. 28

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



ఆత్మ గురించి విసుగు వచ్చేలా శ్రవణం చెయ్యండి, అప్పుడు మననం జరుగుతుంది. ఆ వస్తువు నందు ప్రీతి కలుగుతుంది. అప్పుడు ఆత్మ గురించి తెలుసుకోవాలి అనే కాంక్ష మీ లోపల నుండి పుట్టుకొని వస్తుంది. ఆత్మను తెలుసుకోవాలి అనే కాంక్ష మీ హృదయం నుండి వచ్చినప్పుడు ఆత్మను తెలుసుకోగలుగుతారు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 13 నవంబర్ 1988, లంకలకోడేరు

ప్రియమైన ఆత్మబంధువులారా!

మనం అక్షరమణమాల గురించి చెప్పకుంటున్నాం. ఇది పెళ్లి నాటి మాల, bride రమణస్వామి, bridegroom అరుణాచలేశ్వరుడు. అక్షరమణమాల పువ్వుల తోటి చేసినటువంటి మాల కాదు. అక్షరములతో తయారు చేసిన మాల అక్షరమణమాల. ఈ మాల క్షరం అయ్యేది కాదు, అంటే మనం పువ్వుల తోటి చేసినటువంటి మాల వాడిపోతుంది. ఇది అలా వాడిపోయేది కాదు, నశించేది కాదు. కలకాలం చిరకాలం ఉండే మాల. మనం కలకాలం చిరకాలం స్మరించుకోదగిన మాల. నేను నీకు అక్షరాల తోటి తయారు చేసిన ఈ మాల వేస్తాను. మరి నువ్వు నాకు ఏమి మాల వేస్తావు? పెళ్లి కొడుకు కూడా మాల వెయ్యాలి కదా, నువ్వు కరుణ అనే, దయ అనే మాలని నా మీద వెయ్యి అంటున్నారు రమణస్వామి. భగవంతుడికి అనేక నామములు ఉన్నాయి. ఈ నామములలో శివ నామం ఒకటి, నారాయణ నామం ఒకటి చాలా ప్రసిద్ధి పొందినటువంటి నామాలు. ఈ శివ నామాన్ని, నారాయణ నామాన్ని, ఈ పంచాక్షరిని, అష్టాక్షరిని, మంత్రాలుగా చేసుకుని చాలామంది హిందువులు చేస్తూ ఉంటారు. అక్షరమణమాలలో రమణస్వామి అనేక కోణాల నుండి అరుణాచలేశ్వరుడు యొక్క ఔన్నత్యం చెబుతూ వచ్చాడు. ఈ మాల ఎవరి కోసం? ఆయన కోసం కాదు, మన కోసమే ఆ మాల చెప్పాడు. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు కల్పితమే అని చెప్పినటువంటి రమణస్వామికి ఈ పెండ్లి నాటి మాల తోటి పని ఏముంది? ఆయన ద్వైత స్థితిని దాటినటువంటి వ్యక్తి. ఇంత అద్వైతం చెప్పినటువంటి రమణస్వామికి దానితో పని ఏమీ లేదు, మన కోసమే ఆ మాల చెప్పాడు. మన అందరికి పెళ్లిళ్ళు అయ్యాయి. ఎవరి తోటి పెళ్లి అయ్యింది మనకి? ఈ లోకం తోటి, కనిపిస్తున్న ప్రపంచం తోటి పెళ్లి అయ్యింది. ఇది అటువంటి పెళ్లా? అటువంటి పెళ్లి కాదు. ఆత్మ తోటి పెళ్లి చేసుకుంటున్నాడు. మనకు నిరంతరం లోక స్మరణే. ఆత్మని చింతించటం మానేసి నిరంతరం లోకాన్నే చింతిస్తుంటే, చెరకు గెడలో ఉన్న రసం తీసేసిన తరువాత ఆ పిప్పిని నోట్లో పెట్టుకుని రసం వస్తుందేమో అని నములుతూ ఉంటే ఎంత రసం వస్తుందో, లోకాన్ని స్మరించినా మనం అంతే ఉద్ధరించబడతాము.

లోకానికి అర్పించిన మన మనస్సుని, ఈశ్వరుడు వైపుకి మళ్లించటం కోసం, ఆత్మ వైపుకి మళ్లించటం కోసం, సౌందర్యం వైపుకి మళ్లించటం కోసం, లైఫ్‌లో క్వాలిటీ పెంచటం కోసం, మన జీవితం ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లటం కోసం ఈ అక్షరమణమాల తయారు చేశాడు. అంటే ఇప్పుడు మనం ఎవరి తోటి పెళ్లి చేసుకోవాలి? ఆత్మ తోటి పెళ్లి చేసుకోవాలి,

సత్యం తోటి పెళ్లి చేసుకోవాలి. అది ఎక్కడ ఉంది? మన హృదయంలోనే ఉంది. యేసు అన్నాడు స్వర్గ రాజ్యం మీ హృదయంలోనే ఉంది. నిజమైన అరుణాచలం మీ హృదయంలోనే ఉంది అని భగవంతుడు చెప్పింది. మన శరీరం మరణిస్తుంది కాని మన హృదయంలో ఉన్న వస్తువుకు మరణం లేదు. జ్ఞానిని ప్రేమించటంవల్ల మనకు నష్టం ఏమీ లేదు. ఎందుచేత అంటే మానవుడి యొక్క గమ్యం జ్ఞానం. అందుచేత జ్ఞాని తోటి మీరు సంబంధం పెట్టుకుంటే ఆ జ్ఞాని యొక్క జీవితం వింటే, ఆ జ్ఞాని చెప్పిన మాటలు వింటే, మనకి ఇంకా జ్ఞానం గురించి వినాలి, తెలుసుకోవాలి అనే కోరిక కలుగుతుంది. అందుచేత ఒక అవతార పురుషుడు తోటి కాని, ఒక జ్ఞాని తోటి కాని, లేకపోతే గ్రేట్ క్వాలిటీస్ ఉన్నటువంటి ఒక మహాత్ముడి తోటి కాని మన అనుబంధం ఉండాలి. జ్ఞానం తోటి, ఒక అవతార పురుషుడు తోటి ఉన్న అనుబంధం వల్ల, మనం జ్ఞానం గురించి ఎక్కువ విషయాలు తెలుసుకోగలుగుతాము.

ఓ అరుణాచలేశ్వరుడా! ప్రకృతి ప్రవాహంలో కొట్టుకుపోతున్న నన్ను, ఈ రాగ ద్వేషాల ప్రవాహంలో కొట్టుకుపోతున్న నన్ను అజ్ఞానంలో, బంధంలో, చీకటిలో కొట్టుకుపోతున్న నన్ను, ఊరికే అరుణాచలం అని స్మరించాను. నేను యోగాభ్యాసాలు చెయ్యలేదు, పూజలు చెయ్యలేదు, వ్రతాలు చెయ్యలేదు, ఏమి చెయ్యలేదు. భక్తుడికి ఉండవలసిన లక్షణాలు కాని, నేను భక్తుడే అని చెప్పుకోడానికి తగిన మేటర్ కాని నా దగ్గర ఏమి లేదు. అరుణాచల అని అన్నాను అంతే, నా పని పూర్తి చేసేశావు, నీ గొప్పతనం ఇట్టిది, నీ యొక్క ఔన్నత్యం ఇట్టిది అని చెప్పగలిగినవారు ఎవరు ఉన్నారు అరుణాచల? అరుణాచలం, అరుణాచలం అని నేను స్మరించాను. స్మరించటం తోటే నన్ను పట్టుకుని లాగేశావు. ఒకసారి లిఫ్ట్ ఇచ్చావు, ఇది సామాన్యమైన లిఫ్ట్ కాదే, ఎంత గొప్ప లిఫ్ట్, ప్రకృతి లోంచి నా మనసుని విడదీసేసి నీ హృదయంలోకి నన్ను తీసుకున్నావు. అటువంటి నీ గొప్పతనం గురించి నేను వర్ణించగలనా? నీ యొక్క ఔన్నత్యం గురించి నేను చెప్పగలనా? నేను సరిపోతానా? నేను సరిపోను అరుణాచల. మీరు అనేక గ్రంధాలు చదవటం కంటే కూడా ఈశ్వరుడి పట్ల ఇష్టం ఉంటే ఎక్కువ జ్ఞానాన్ని మీరు పొందగలుగుతారు. హృదయపూర్వకంగా పరమేశ్వరుడి పట్ల మీరు ప్రీతిని పెంచుకుంటే మీకు తెలియకుండానే మీ జీవితం ఎంతగానో మారిపోతుంది. మీరు ప్రయాణం చేస్తున్నట్టు కూడా మీకు తెలియదు. మీకు తెలియకుండానే మీరు గమ్యానికి చేరుకుంటారు. Indian హిస్టరీలో ఒకొక్క మహాత్ముడు ఒకొక్క క్షేత్రానికి ఆకర్షించబడ్డాడు. 54 సంవత్సరాలు ఈ అరుణాచల క్షేత్రంలో ఉన్నాను. ఈ క్షేత్రాన్ని విడిచి పెట్టి వెళ్ళాలి అనేటటువంటి తలంపు ఎప్పుడూ కూడా నాకు రాలేదు అని రమణస్వామి చెప్పారు.

అలాగే తుకారాం చెప్పాడు. ఎవడైతే పండరీపురాన్ని చూస్తాడో వాడు పాండురంగడు

అంతటి వాడు అయిపోతాడు అని, ఒక జ్ఞానిని స్మరించండి మీకు ఎంతో శాంతి కలుగుతుంది, మీ మనసుకి ఎంతో చల్లదనం కలుగుతుంది, మీ మనసుకి ఎంతో ఆనందం కలుగుతుంది, కెరటాలు లేని సముద్రం ఎంత ప్రశాంతంగా ఉంటుందో, అటువంటి ప్రశాంత స్థితిలోకి మనం అందరం వెళతాం. సముద్రంలో కెరటాలు లేవు అనుకోండి ఎంత ప్రశాంతంగా ఉంటుందో చూడండి. అటువంటి శాంతి సముద్రం, మన హృదయంలో ఉంది. హృదయంలో ఉన్నటువంటి ఆనంద సముద్రంలో మనం ప్రవేశించడం కోసమే ఈ అక్షరమణమాలని తయారు చేశాడు భగవాన్ శ్రీ రమణమహర్షి. ఏదైనామీరు చదివేటప్పుడు అది కేవలం చదివితే సరిపోదు. దానిని అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకోవటం కూడా ఒక యోగమే. అర్థం చేసుకుంటే మీకు ఆచరించాలి అనే బుద్ధి కలుగుతుంది. మీకు సబ్జెక్టు అర్థం కాని రోజున ఆచరించాలి అనే బుద్ధి కలగదు. తిన్న అన్నం ఎప్పుడైతే మీకు జీర్ణం అయ్యిందో, అప్పుడు మీకు strength కూడా వస్తుంది. అదే విధంగా మీరు చదివిన విషయం మీకు గనుక బాగా అర్థం అయితే అది మీ హృదయానికి పడితే, మీరు తప్పనిసరిగా బాగుపడతారు. మీ జీవితం యొక్క సరళిలో మార్పు వస్తుంది. మీరు ఎంతకాలం జీవించినప్పటికీ, ఎక్కడ జీవించినప్పటికీ మీజీవితం యొక్క బరువు మీరు మోయక్కరలేదు. ఎప్పుడైతే మీకు ఆత్మ తోటి టచ్ ఉందో, మీ బాహ్యమైన జీవితంలో ఒడిదుడుకులు వచ్చినప్పటికీ, కష్ట సుఖాలు వచ్చినప్పటికీ, అవన్నీ మనలని తాకవు. అటువంటి ఉన్నత స్థితికి, దుఃఖం లేని స్థితికి మనలని తీసుకువెళ్ళడం కోసమే అక్షరమణమాల తయారు చేశాడు రమణస్వామి.

మీరు భగవంతుడిని తెలుసుకోవాలి అనుకుంటే మీరు భగవంతుడు అంతటి వాళ్ళు అవ్వాలి. ఆ స్థాయికి మనం అందరం ఎదగాలి. అదిగో పులి అని మనం అనుకుంటాం, అదిగో మనిషి అని పులి అనుకుంటుంది. ప్రతీ జీవికి భయమే! ఒకసారి భగవాన్‌ని అడిగారు మీకు ఎప్పుడైనా భయం వేస్తుందా అని, అసలు ఈ భూమి మీద భయపడడానికి ఏమి ఉంది అసలు అన్నారు. అటువంటి అభయస్థితికి మనం చేరుకోవాలి. సుబ్బరామయ్యగారు మీకు ఏమి కావాలి అని భగవాన్ ఏదో ఒక మాటల సందర్భంలో అన్నారు. సుబ్బరామయ్య గారు నాకు డబ్బు కావాలి అనలేదు, నాకు గౌరవం కావాలి అని అడగలేదు, లేకపోతే నాకు సోషల్ స్టేటస్ కావాలి అని అడగలేదు. మీరు అడుగుతున్నారు కాబట్టి చెబుతున్నాను, నాకు ఏమి కావాలి అంటే అభయం, భయంలేని స్థితి నాకు ప్రసాదించుస్వామి అన్నారు. అప్పుడు భగవాన్ సరి సరి అన్నారు. కృష్ణుడు నువ్వు భయాన్ని విడిచిపెట్టు, కామాన్ని విడిచిపెట్టు, క్రోధాన్ని విడిచి పెట్టు అని సందర్భం వచ్చినప్పుడల్లా అర్జునుడిని ఎదురుగా పెట్టుకుని మానవ జాతికి చెప్పాడు. రాగాన్ని విడిచిపెట్టు, భయాన్ని విడిచిపెట్టు, క్రోధాన్ని

విడిచిపెట్టు అని భగవంతుడు అనేక సార్లు చెప్పాడు. భయం వస్తే నష్టం ఏమిటి అంటే, మీకు భయం వచ్చిన ప్రతీ సెకనులో మీకు దుఃఖం వచ్చి తీరుతుంది. ప్రతీ వాడికి భయం ఉంది, భయం లేని వ్యక్తి లేడు, అది జీవుడు యొక్క లక్షణం. నీ కంటే వేరుగా వస్తువును చూస్తున్నంత కాలం నీకు తప్పనిసరిగా భయం ఉంటుంది. భక్తి అనేది చాలా చిన్న విషయం అనుకుంటారు. భక్తి కలగటానికి కూడా చాలా ధైర్యం ఉండాలి. ఎంతో ధైర్యం ఉన్నవాడికి కాని నిజమైన భక్తి కలగదు. దానికెంతో ధైర్యం ఉండాలి. మనిషి తాను అనుభవిస్తున్న భోగాలకి దూరం కావాలి అంటే పిరికివాడు మటుకు తన భోగాలను ఎవడు విడిచి పెట్టలేడు. అత్యంత ధైర్యవంతుడు మాత్రమే, నిజమైన ధైర్యవంతుడు మాత్రమే, తాను అనుభవిస్తున్న భోగాన్ని విడిచిపెట్టి తన ఇంద్రియాలను, తన మనసుని పరమేశ్వరుడి వైపు తిప్పగలడు కాని, పిరికి వాడు చేసే పని కాదు. చాలామంది భక్తి అంటే ఎగతాళి చేయొచ్చు. అది మీరు అనుకున్నంత తేలికగా వచ్చేది కాదు. దానికెంతో ధైర్యం ఉండాలి. ధైర్యం లేకపోతే రానే రాదు. అది పిరికివాడి సొమ్ము కాదు, ఎవరికి అయితే ధైర్యం ఉందో, వాళ్ళే ఆత్మ అనే సంపదని పొందగలరు కాని అది పిరికి వాళ్ళ సొమ్ము కాదు.

ఈ మధ్య ఒకరు నాదగ్గర రమణస్వామిని విమర్శించారు, మీ భక్తిని చెదరగొట్టడం కోసం రమణస్వామిని విమర్శించడం లేదు అన్నారు. అప్పుడు నేను వారితో అన్నాను ఏదైనా కారణం వల్ల నాకు రమణస్వామి మీద భక్తి కలిగితే, మీరు విమర్శిస్తే నాకు కంగారు పుడుతుంది. అలా కంగారు పడవలసిన అవసరం నాకు లేదు. నాకు రమణస్వామి మీద ఉన్న భక్తి అకారణభక్తి. మీరు చెప్పే మాటలకే, అంత మాత్రానికే నా మనస్సు చలించిపోతుంది అని తక్కువ అంచనా మీరు వేయవద్దు. అంత తేలికగా నాకు భగవాన్ మీద భక్తి పోతుంది అని మీరు అనుకోవద్దు. అలా అనుకుంటే మటుకు మీ అంచనా తప్పు. రమణమహర్షి అని నేను ఒకసారి హిందీలో చదివిన వెంటనే నాకు ఆయన పట్ల devotion, ఒక thrill, ఒకరకమైన తపన కలిగింది కాని ఆయన ఋషి అని నాకు తెలియదు, ఆయన జ్ఞాని అని నాకు తెలియదు, ఆయన మోడరన్ మహర్షి అని తెలియదు. ఆయన అంటే ఏమిటో తెలియకుండానే ఆయన పట్ల నాకు ప్రేమ కలిగింది. అందుచేత మీరు చెప్పే చిన్న చిన్న మాటలు చూసి చెదిరిపోయే మైండ్ కాదు. తుమ్ము వస్తే ఊడిపోయేది కాదు. తుమ్ము



**మనము కూర్చుని మాట్లాడుకునే మాటలు వ్యవహారిక నిజం.**

**నిజానికి ఈ మాటలు అన్నీ అబద్ధము. బ్రహ్మము ఒక్కటే నిజము.**

వస్తే ఊడిపోయే భక్తి తోటి lifeని dedicate చెయ్యగలమా?

అభయస్థితి ఒక మనిషి పొందాలి అంటే ఈశ్వర అనుగ్రహం ఉండాలి. దైవ అనుగ్రహం లేకపోతే వాడు అభయస్థితిని పొందలేడు. ఓ అరుణాచలేశ్వరుడా! నీకు భయం అంటే ఏమిటో తెలియదు. భయం ఎక్కడ లేదో ఆ స్థానంలో నువ్వు ఉన్నావు. ఇంక నీకు భయం ఏమిటి? నన్ను తీసుకోవటం కోసం, నీ హృదయంలో నాకు స్థానం ఇవ్వటం కోసం, నీకు భయపడవలసిన పని ఏమి లేదు. ఎందుచేత అంటే భయం అనేది ఎలా ఉంటుందో నీకు తెలియదు. మనం కూడా భయం లేని స్థితికి వెళ్ళాలి అంటే భగవంతుడిని పొందాలి. మనస్సులో భయం ఉంది, జీవత్వంలో భయం ఉంది, భయం ఎక్కడ లేదు? భగవంతుడిలో భయం లేదు. ఈ జన్మలోనే కాదు, రాబోయే జన్మలోనే కాదు, మరుజన్మలోనే కాదు, ఇక్కడ నుంచి ఏ లోకంలోకి వెళ్ళినప్పటికీ స్వర్గ లోకంలోకి వెళ్ళినా, నరక లోకానికి వెళ్ళినా, మరణానంతర జీవితంలో కూడా మనకి భయం పుడుతూనే ఉంటుంది. ఎప్పుడు మనకి భయం పోతుంది? అది ఒక్క చోటే! ఎప్పుడైతే మనం భగవంతుడిని తెలుసుకున్నామో, సత్యాన్ని ఎప్పుడైతే నువ్వు అనుభవించావో, భగవంతుడు నీకు అనుభవంలోకి వచ్చేవరకు దైవానుభూతి నీకు కలిగేవరకు భయం నిన్ను వెంటాడుతూనే ఉంటుంది. ఎందుచేత నువ్వు భగవంతుడిని తెలుసుకోవాలి? భగవంతుడిలో భయం లేదు కాబట్టి. భగవంతుడిని తెలుసుకుంటే నువ్వు భయానికి దూరం అవుతావు.స్వామి వివేకానంద తరచుగా చెప్పేవాడు be fearless be fearless మీరు ఏదైనా చెడ్డ చేసినా నాకు ఇష్టమే కాని భయం లేకుండా చెయ్యండి అనేవాడు. ఎందుచేత అంటే భయం ఉంటే జ్ఞానం కలగదు. భయం లేని స్థితి ఎక్కడ ఉంది? భగవంతుడిలో ఉంది. అందుచేత మనం భగవంతుడిని తెలుసుకుంటే మనం భయానికి దూరం అయిపోతాం.

ఓ అరుణాచలేశ్వరుడా! ఏది సుజ్ఞానం? ఏది అజ్ఞానం? ఏది సుజ్ఞానం? ఏది wrong knowledge? ఏది right knowledge? ఇదంతా కూడా మనసు యొక్క పరిధిలో ఉన్నాయి. ఈ అజ్ఞానం అనేది, ఈ దుఃఖం అనేది, ఈ బంధం అనేది ఇవన్నీ ఎక్కడ ఉన్నాయి మనసు యొక్క పరిధిలో ఉన్నాయి. మనసు ఉన్నప్పుడు ఇవన్నీ వస్తున్నాయి. మనసుంటే జగత్తు ఉంది, మనసు ఉంటే దేవుడు ఉన్నాడు. మనసు ఉంటే సమస్యలు అన్నీ ఉన్నాయి. ఈ మనస్సు అనే ప్రకృతిని దాటి వెళ్ళినప్పుడు ఏమి లేవు. ఉన్నది ఒక్కటే వస్తువు. అక్కడ అజ్ఞానం ఏమిటి? సుజ్ఞానం ఏమిటి? Right knowledge అనేది wrong knowledge అనేది మనసు యొక్క పరిమితిలోనిది, బుద్ధి యొక్క పరిధిలోనిది. శరీరం కంటే ఇంద్రియాలు గొప్పవి, ఇంద్రియాలు కంటే మనసు గొప్పది, మనసు కంటే బుద్ధి గొప్పది, బుద్ధి కంటే ఆత్మ గొప్పది. నువ్వు ఎప్పుడైతే నీ బుద్ధిని దాటి వెళ్ళావో అంటే ప్రకృతిని దాటి

వెళ్ళావో అప్పుడు నీకు wrong knowledge, right knowledge అని లేదు. ఓ అరుణాచలేశ్వరుడా నీలో ఐక్యం అయిన వాడికి, అంటే ఆత్మ జ్ఞానాన్ని పొందిన వాడికి, ఆ ఔన్నత్యం పొందిన వాడికి, ఈ అజ్ఞానానికి సుజ్ఞానానికి అర్థం లేదు. ఎక్కడ సూర్యుడు ఉదయించాడో, అక్కడ చీకటి ఉంటుందా? నీ హృదయంలో ఉన్నటువంటి జ్ఞానసూర్యుడు ఎప్పుడైతే నీలో ప్రకాశించాడో అప్పుడు ఎటు చూసినా ఆత్మే, పైన ఆత్మ, కింద ఆత్మ, లోపల ఆత్మ, బయట ఆత్మ, ఎటు చూసినా ఆత్మే! అందుచేత నీకు వికారం కలగనే కలగదు. అప్పుడు భయం లేదు. మనకి ద్వైత భావన, మన దృష్టి ఎంతసేపు నామరూప దృష్టి, మన దృష్టి దానికి పరిమితం అయిపోయింది. ఆత్మ దృష్టి మనకి లేదు, దైవ దృష్టి మనకి లేదు. నీకు దేవుడు తోటి attachment ఏమిటి? అని ఎవడైనా ప్రశ్న అడిగితే, దేవుడు తోటి attachment నీకు ఎందుకు అనే వాడికి దేని తోటి attachment ఉంది? వాడికి caste తోటి attachment, వాడికి ఫ్యామిలీ తోటి attachment, డబ్బుతోటి, ఆస్తులతోటి వాడికి attachment.

నువ్వు దేవుడి భక్తుడవా అని ఎవరైనా ఆక్షేపిస్తే వాడు దేనికి భక్తుడు? వాడు attachmentsని విడిచి పెట్టి నీకు దేవుడు తోటి attachment ఎందుకు అని నిన్ను ఆక్షేపిస్తున్నాడా? వాడు ఒక attachmentలో కూరుకు పోయి నిన్ను ఆక్షేపిస్తున్నాడా? నీకు religion తోటి attachment ఎందుకు? నీకు నీ కుటుంబం తోటి attachment ఎందుకు? ఈ ప్రశ్న నిన్ను నువ్వు ఎందుకు వేసుకోవు? నిన్ను నువ్వు ఎందుకు ఆక్షేపించుకోవు? ఎవడో దేవుడు భక్తుడు గురించి ఆలోచించటానికి, వాడిని ఆక్షేపించటానికి నీకు ఉన్న అర్హత ఏమిటి? నీకున్న మానసిక స్థాయి ఏమిటి? సాంఘికంగా నీ యొక్క స్టేటస్ పెంచుకోవటం కోసం, దానిని దృష్టిలో పెట్టుకుని ఎవరినో భక్తుడిని విమర్శిస్తూ ఉంటే నీకు ఉన్న మానసిక స్థాయి ఏమిటి అసలు? ఈ అచ్చు బుచ్చు మాటలు పట్టుకుని మీరు కంగారు పడి మీరు నిదానం తప్పకండి. మీ దారిలో మీరు ప్రయాణం చెయ్యండి. నిదానంగా ఉండండి అంతే కాని మీరు అనవసరంగా లేనిపోని మాటలు అన్నీ పుచ్చుకుని అజ్ఞానంతోటి మీ తలను నింపుకోవద్దు.

మనకి అందరికి ఉన్న disease అదే. మీకు ఉంది, నాకు ఉంది, అన్ని దేశాలలో ఉంది, అన్ని మతాలలో ఉంది ఉన్న రోగం ఒక్కటే అది అజ్ఞానం. కొంతమందికి నిజంగా greatness ఉండదు. వాళ్ళ బుర్ర మీద greatnessని ఆపాదిస్తారు. మనకంటే ఎక్కువ ఉంది వాళ్ళకి అజ్ఞానం. మీరు ఏ దేశం వెళ్ళినా అన్ని చోట్ల అజ్ఞానం ఉంది. దేహానికి ఉన్న రోగాలు అన్నీ కూడా స్మశానంలో కాలిపోయి అన్నీ పోతాయి. కాని ఈ అజ్ఞానం పోదు. మీ దేహానికి రోగం వచ్చినా, మీ మనసుకి రోగం వచ్చినా ఏది మూలకారణం? అజ్ఞానమే మూల కారణం. హిందూమతంలో దీనినే మనం అజ్ఞానం అంటాం. క్రైస్తవమతంలో దీనిని పాపం

అంటారు. ఇంకా మహమ్మదీయులు ఏమి చెబుతారు అంటే తిరస్కారం అంటారు. అంటే ఏమిటి అంటే భగవంతుడు చెప్పిన మంచి విషయాలని నువ్వు కాదని వాటిని విడిచి పెట్టేసి, నువ్వు మంచిని ఆచరించకుండా చెడ్డని ఆచరిస్తూ ఉంటే, భగవంతుడు చెప్పిన మాటని నువ్వు కాదు అంటున్నావు కాబట్టి వాళ్ళు దానిని తిరస్కారం అన్నారు. హిందువులు దేనిని అయితే అజ్ఞానం అంటున్నారో దానినే క్రైస్తవులు పాపం అన్నారు. దేనిని అయితే క్రైస్తవులు పాపం అంటున్నారో దానినే మహమ్మదీయులు తిరస్కారం అన్నారు. ఇలా ఒక్కొక్క మతంలో ఒక్కొక్క పేరు పెట్టుకుని పిలుస్తున్నారు. కాని మొత్తం మీద కామన్‌గా ఉండేది ఒక్కటే, ఈ దేశంలోనే కాదు, ఆ దేశంలోనే కాదు, ఏ దేశంలో మీరు చూసినప్పటికీ సాధారణంగా ఉండే రోగం అజ్ఞానం.

ఈ అజ్ఞానం లోంచే మిగతా అన్ని రోగాలు వస్తున్నాయి. అందుచేత అజ్ఞానమే మూలకారణం. దానిని స్మశానంలో కాల్చలేము. ఇది జన్మజన్మలకి నీ కూడా వస్తూ ఉంటుంది. ఈ అజ్ఞానం అనేది నువ్వు స్వర్గలోకంలో పోగొట్టుకోలేవు. వైకుంఠంలో, కైలాసంలో ఎక్కడో ఉన్నతమైన లోకంలో నువ్వు అజ్ఞానం పోగొట్టుకోలేవు. నువ్వు భూమి మీద ఉండగా, నువ్వు మరణించక ముందే ఈ అజ్ఞానాన్ని పోగొట్టుకోవాలి. అలా పోగొట్టుకోకుండా కనుక నువ్వు శరీరాన్ని విడిచి పెడితే చాలా నష్టాన్ని అనుభవించవలసి ఉంటుంది, చాలా కష్టాన్ని అనుభవించాలి. తరువాత సాధన చేసి నువ్వు చేసేది ఏమి లేదు. అది ఇప్పడే ఇక్కడే ఈ దేహంలో ఉండగానే నీ అజ్ఞానం అనే మూలరోగాన్ని తొలగించు కోవడం కోసం ప్రయత్నం చెయ్యి. అది నీకు భక్తి మార్గమో, జ్ఞాన మార్గమో, కర్మ మార్గమో, నీకు నచ్చిన మార్గంలో, నీకు నచ్చిన పద్ధతిలో ప్రయాణం చేసి, నీకు నచ్చినటువంటి గురువుని ఆశ్రయించి మీకు నచ్చినటువంటి మతాన్ని మీరు తీసుకుని మీరు బాగుపడటం చాలా ముఖ్యం. రేపు రేపు అని వాయిదాలు వేసుకోకండి. అది ఇప్పడే జరగాలి. ఒక విద్యార్థి ఉన్నాడు అనుకోండి దీపాలు ఉండగా చదువుకోమని చెబితే వాడు చదవడు అనుకోండి, దీపాలు ఆరిపోయిన తరువాత చదవమంటే చదువుతాడా? అదే విధంగా మీరు శాంతిగా ఉండి పాపం తోటి పోరాడండి. మన మనసుని, మన ఇంద్రియాలను శాంతిగా పెట్టుకోవాలి. పాపంతో పోరాడడం చిన్న విషయం కాదు. అది చాలా పెద్ద విషయం. మనం శాంతిగా ఉండాలి. ఆందోళన రానివ్వకూడదు. పరమాత్మను చింతిస్తుంటే శాంతి వస్తుంది, బలం వస్తుంది. అప్పడు పాపం తోటి పోరాడండి. అప్పుడు అజ్ఞానం తోటి పోరాడండి. పోరాడాలి అంటే కొంత energy ఉండాలి మనకి, కొంత energy లేకుండా మనలో ఉన్నటువంటి క్షుద్ర శక్తుల తోటి, నీచ శక్తుల తోటి మనం పోరాడ లేము. ఆ energy ఎలా వస్తుంది? నిరంతరం

పరమేశ్వరుణ్ణి స్మరించటం వల్ల వస్తుంది. ప్రాణాయామాలు చెయ్యాలి, అవి చెయ్యాలి, ఇవి చెయ్యాలి అంటే మీరు చేసుకునే పద్ధతిలో మీరు చేసుకోండి. కాని ఇక్కడ రమణస్వామి ఏమి చెపుతున్నాడు అంటే మీరు నిరంతరం భగవంతుని రూపాన్ని ధ్యానించటం వలన, ఆ నామాన్ని స్మరించటం వల్ల, లోపల ఉన్న అజ్ఞానం పోతుంది.

రమణస్వామి అరుణాచలేశ్వరుడితో ఏమి చెబుతున్నాడు అంటే నువ్వు మందే కాదు డాక్టరు కూడా నువ్వే అంటున్నాడు. మనం హాస్పిటల్‌కి వెళితే డాక్టరు గారు మందు రాసిస్తారు. మందు వేరు డాక్టరు గారు వేరు, డాక్టరు గారు మందు రాసిస్తారు కాని మందు డాక్టరు గారు కాదు, డాక్టరు గారు మందు కాదు. కానీ ఇక్కడ అరుణాచలేశ్వరుడు ఎవరు? ఆయనే మందు ఆయనే డాక్టరు. నన్ను కొంతమంది అడుగుతూ ఉంటారు మీరు ఏమైనా సాధన చేస్తున్నారా అని, నేను అసలు సాధన చేస్తే కదా, నాకు సాధన అరుణాచలమే. నాకు గమ్యం అరుణాచలం. నాకు సాధన ఎవరు? భగవాన్, గమ్యం ఎవరు? భగవాన్, ఇంక సాధన ఏమిటి? అంటే సాధన చేయకూడదు అని కాదు నా సాధన చెబుతున్నాను. అరుణాచలేశ్వరుడి తోటి ఏమి చెబుతున్నారు రమణస్వామి? డాక్టరు నువ్వే, మందు నువ్వే, డాక్టరు మందు వేరు కాదు. నువ్వు గిరి రూపంలో ఉన్నావు. కాని నువ్వే మందు, నువ్వే డాక్టరు. పైకి ఊరికే కొండే కదా అని మీకు అనిపిస్తుంది కానీ అదే మందు, అదే డాక్టరు. మీకు దేహానికి సంబంధించిన రోగాలు మాత్రమే తగ్గించే డాక్టరు కాదు. లేకపోతే మీ మనసులోని బెంగ తీసేసే మాములు మానసిక వైద్యుడు కాదు. ఇవన్నిటికీ మూలం అయినటువంటి అజ్ఞానాన్ని తీసేసే ఘన వైద్యుడు. మాములు డాక్టరు కాదు. శరీరంలో రోగాలు ఎందుకు వస్తున్నాయో, మనసుకి కష్టాలు ఎందుకు వస్తున్నాయో, ఇవన్నిటికీ మూలం అయినటువంటి అజ్ఞానం అనే రోగాన్ని తీసేయటానికి నువ్వు ఈ గిరి రూపంలో వచ్చావు అరుణాచల. నువ్వు పైకి కొండ కిందే కనిపిస్తున్నావు. కొండ కొండ అంటే అది ఊరికే రాయి కాదు. ఆయన వైద్యుడు. అది రాయి కాదు, అది మందు. మనకి దుఃఖం తీసుకొచ్చే కారణాలు అనేకం వస్తున్నాయి. లోపల అజ్ఞానం ఉంది ఈ అజ్ఞానం వల్ల ఇవన్నీ వస్తున్నాయి. అజ్ఞానం అనే వేరు ని, అజ్ఞానం అనే మొదలుని తీసేటటువంటి మందు, అటువంటి డాక్టరు నువ్వు అరుణాచలేశ్వరుడా అంటున్నారు భగవాన్.

దేవుడు వేరు, అనుగ్రహం వేరు కాదు. మాట వరసకి దైవ అనుగ్రహం అంటాం. అనుగ్రహం అంటేనే దేవుడు. దేవుడి యొక్క అనుగ్రహంతోటి ఆ గిరి తయారుచెయ్యబడింది. ఈ మాంస నేత్రాలకి అది రాళ్ల కింద కనిపిస్తుంది. ఏ కారణం వల్ల నువ్వు బంధించ బడుతున్నావో, ఏ కారణం వల్ల అయితే నువ్వు జన్మిస్తున్నావో, ఏ కారణం వల్ల అయితే నువ్వు మరణిస్తున్నావో, ఏ కారణం వల్ల అయితే నిన్ను దుఃఖం వెంటాడుతుందో, ఇవన్నిటికీ

మూలం కారణం ఉంది. ఆ కారణం వల్ల ఇవన్నీ వస్తున్నాయి. కారణం లేకపోతే కార్యం లేదు. కారణం ఉన్నంత సేపు కార్యం వస్తూ ఉంటుంది. అందుచేత కారణాన్ని తీసే వైద్యుడవు అయ్యా నువ్వు. అందుచేత ఈశ్వరుడు ఏమి చేశాడు అంటే తన కృపను పోసి తన కృపతో తయారు చేసినటువంటి గిరి ఈ అరుణాచలం. దేహానికి పరిమితం అయిన బుద్ధి, మన ఇంద్రియాలకి పరిమితం అయిన బుద్ధి, పరిసరాలకు పరిమితం అయిన బుద్ధి, ఏదో ఒకకులానికో, ఒక ప్రాంతీయ తత్వానికో ఇటువంటి సంకుచిత విషయాలకు, పరిమితం అయినటువంటి బుద్ధిని తొలగించటం కోసం అజ్ఞానాన్ని తొలగించటం కోసం నువ్వు గిరి రూపంలో వెలిశావు. నా అంతట నేను దానిని తీసుకోలేను కాబట్టి నన్ను అనుగ్రహించటం కోసం ఆ గిరి రూపంలో అవతరించావు. మాలో ఉన్నటువంటి అజ్ఞానాన్ని తీసేసి జ్ఞాన మార్గాన్ని ఉద్ధరించడం కోసం జ్ఞానమార్గాన్ని లోకానికి ఎత్తి చూపించటం కోసం, జ్ఞానం యొక్క ఔన్నత్యం చెప్పటం కోసం నువ్వు ఆ గిరిరూపంలో అవతరించావు. అది కొండ కాదు ఈశ్వరుడి యొక్క ప్రేమ, ఈశ్వరుడి యొక్క కరుణ, ఈశ్వరుడి యొక్క ఆప్యాయత, ఈశ్వరుడి యొక్క విలాసమే ఆ కొండ.

నిజమైన అరుణాచలేశ్వరుడు బయట ఎక్కడో తిరువణ్ణామలై లో లేడు. నిజమైన అరుణాచలేశ్వరుడు మన హృదయంలోనే ఉన్నాడు. అరుణాచలేశ్వరుడా నువ్వు మందువే, నువ్వు డాక్టరువే అయితే నువ్వు బాహ్యంగా ఉన్నావు. నువ్వు నా హృదయంలో కూడా ఉన్నావు. నువ్వు బాహ్యంగా ఉంటే మళ్ళీ విడిపోవటం ఉంటుంది. మళ్ళీ కలవటాలు ఉంటాయి. రావటాలు ఉంటాయి, వెళ్ళటాలు ఉంటాయి. ఆత్మరూపంలో ఉన్నటువంటి నువ్వు నాకు అనుభవం అయ్యేటట్టు, నాకు తెలిసేటట్టు అనుగ్రహించు అరుణాచల, ఎందుచేత అంటే, నువ్వు అనుగ్రహించటానికి ఈ లోకంలోకి వచ్చావు కదా, అందుచేత నా హృదయంలో ఉన్నటువంటి వస్తువును తెలుసుకోవటానికి సహకరించి నాకు సాయం చెయ్యి. ఓ అరుణాచలేశ్వరుడా! దయకి మారు పేరు అయిన ఓ అరుణాచలేశ్వరుడా! ప్రేమకి మారు పేరు అయినా ఓ అరుణాచలేశ్వరుడా! ఆ ప్రేమ తత్త్వం ఎలా ఉంటుంది అంటే కామానికి పరిమితులు ఉంటాయి కాని ప్రేమకి పరిమితులు లేవు. దేహానికి పరిమితం అయినది,

**ఒక పని నీకు మంచి కింద అనిపించినా భగవంతుడు ఆ పనిని వద్దు అంటే దానిని వదిలేయాలి. ఎందుచేతనంటే నీ తెలివితేటలకు భగవంతుడు చెప్పింది అర్థం కాదు. మనం చేయవలసిన పని మానకూడదు. చేయకూడని పని చేయకూడదు. ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అని నిర్ణయించేది నీ బుద్ధి కాదు, అది పరమాత్మ చెప్పాలి.**



మనసుకు పరిమితం అయినది కామం. దేహానికి మనసుకి అతీతం అయినది పరిమితం లేనిది అది ప్రేమ. ప్రేమ వేరు, కామం వేరు. నాకు ఇది కావాలి, అది కావాలి అని కామం అడుగుతుంది, కాని ప్రేమకి అడిగే స్వభావం లేదు. అడిగేది ప్రేమ కాదు.

ఈ లోకంలో ఎవడు సుఖపడుతున్నాడు అంటే, ఒక్క జ్ఞాని మాత్రమే సుఖపడుతున్నాడు. జ్ఞాని పొందే సుఖం అది పొదుగు దగ్గర పాలు లాంటిదే కాని నీళ్ళు కలిపిన పాలు లాంటిది కాదు. అయితే మేము అప్పుడప్పుడు సుఖాలు అనుభవిస్తున్నాం. జున్ను తిన్నప్పుడు బాగానే ఉంటుంది, సినిమా చూసినప్పుడు బాగానే ఉంటుంది, ఇలా మేము కూడా కొద్ది కొద్దిగా సుఖాలు అనుభవిస్తున్నాం అంటే ఒక శేరు పాలలో పదిశేరులు నీళ్ళు కలిపితే ఎలా ఉంటుందో, చూడటానికి పాలు కింద ఉంటుంది నోట్లో వేసుకుంటే నీళ్ళ రుచి వస్తుంది కాని పాల రుచి రాదు. మనం అనుభవించే సుఖాలు అన్నీ అటువంటివే. ఓ అరుణాచలేశ్వరుడా నువ్వు కృప చూపించి, నా హృదయంలో ఉన్న వస్తువును నేను తెలుసుకునేలా చెయ్యి అరుణాచల, నా మనసుని అంతర్ముఖ పరచడానికి సహకరించు అరుణాచల. ఎవరి సమక్షంలో కూర్చొంటే మన ఇంద్రియాలు మన మనసు నిర్మలంగా ఉంటాయో వాడే జ్ఞాని. ఎక్కడ మనకి శాంతి, కాంతి, ఆనందంకలుగుతాయో, వాడే జ్ఞాని. ఆ స్థితి మాకు కలుగజేయటం కోసం నీ కృప చూపించి నాలో వెలుగును ప్రసరించు అరుణాచల.

మనకి భక్తి ఉంది భక్తితో పాటు మనకి ఒక విధమైనటువంటి తత్తరపాటు కూడా ఉంది. మన బ్రెయిన్‌లో Confusion ఉంది. కారణం ఏమిటి అంటే మనకి అబద్ధం నిజం కింద కనిపిస్తోంది. అబద్ధం నిజం కింద కనిపిస్తున్నంత కాలం మనకి కోరిక వస్తూనే ఉంటుంది, భ్రాంతి పుడుతూ ఉంటుంది. ఈ లోకంలో మీరు ఏదైనా అబద్ధం చెప్పండి, నిజం చెప్పండి, అబద్ధం నమ్మినట్టు నిజాన్ని నమ్మరు. లోకంలో తొందరగా spread అయ్యేది అబద్ధమే. కారణం ఏమిటి? లోకం కూడా అబద్ధమే. అది రహస్యం. లోకం కూడా అబద్ధం కాబట్టి అబద్ధాన్ని తొందరగా నమ్ముతుంది. అయితే ఇపుడు మనకు లోకం నిజం కాదు కానీ నిజం వలె కనిపిస్తోంది. మనకి నిజం ఏమిటో తెలుసుకునే వరకు ఎన్ని జన్మలు ఎత్తినా ఈ లోకం నిజం కిందే కనిపిస్తుంది. ఈ దేహం నిజం, లోకం నిజం, క్రోధం నిజం, కామం నిజం, మనం అనుకునేవి అన్నీ నిజం కింద అనిపిస్తాయి. ఎప్పటి వరకు? మనం నిజం తెలుసుకునే వరకు అలా అనిపిస్తుంది. నిజం ఎక్కడ ఉంది? ఎక్కడో పెద్ద తిరుపతిలో ఉందా? అరుణాచలంలో ఉందా? అమెరికాలో ఉందా? ఎక్కడ ఉంది ఆ నిజం? మీ హృదయంలోనే ఉంది. పరమేశ్వరుడు నిజాన్ని మన హృదయంలోనే పదిలపర్చి ఉంచాడు. దానిని తెలుసుకోవటానికి మనం దేశాలు తిరుగుతున్నాం అన్నిచోట్ల

తిరుగుతున్నాం కానీ మన మనసుని ఎక్కడైతే నిజం ఉందో, అటువైపు తిప్పలేక పోతున్నాం. మనసుని అంతర్ముఖం చెయ్యలేక పోతున్నాం, బాహ్యంగా ఎక్కడో వెతుకుతున్నాం. ఇలా ఎన్ని జన్మలు వెతికినా, ఎంత కాలం వెతికినా, మీకు నిజం కనపడదు. ఎందుచేత? లోకంలో నిజం లేదు కాబట్టి. ఎక్కడ ఉంది నిజం? మీ హృదయంలోనే ఉంది.

మాకు ఈ మధ్య సుఖం లేదు, శాంతి లేదు, చాలా గొడవలుగా ఉంటున్నాయి అని ఏదో ఒకటి చెబుతూ ఉంటారు. ప్రతి చోట complaint ఏదో ఒకటి ఉంటుంది. ఈ complaint ఎప్పటి వరకు ఉంటుంది అంటే మీ హృదయంలో ఉన్న నిజాన్ని ఆత్మని తెలుసుకునే వరకు ఈ complaint ప్రతీ జన్మలోను ఉంటుంది. అజ్ఞానం ఉన్నంతకాలం ఏదో ఒక రూపంలో దుఃఖం వెంటాడుతూనే ఉంటుంది. విషాదం వస్తూ ఉంటుంది. నిజాన్ని తెలుసుకునే వరకు దుఃఖం లేని స్థితికి వెళ్ళలేము. అది ఎక్కడ ఉంది? మన హృదయంలోనే ఉంది. మన మనస్సు ఎంతసేపు బాహ్యానికి వెళుతుంది. అది అంతర్ముఖం అవ్వటం లేదు. దానికి కారణం ఏమిటి? పాపం కారణం. ధ్యానం చేద్దాం అని కూర్చొంటే మనసు నిలబడదు. అసలు మన హృదయంలో సత్యం అనేది ఒకటి ఉందని కూడా మనకు తెలియటం లేదు. దానికి మనిషిలో ఉన్న దోషం కారణం. తెలుసుకుంటామా, తెలుసుకోమా అనేది వేరే విషయం. అసలు పరమార్థం అనేది ఒకటి మన హృదయంలో ఉంది అనే జ్ఞానం కూడా మనకు రావడం లేదు. ఇదే భగవాన్ చెప్పారు. దేవుడు ఉన్నాడా, లేడా అని నీకు సందేహం కలగవచ్చు. లేకపోతే మరొక విషయం గురించి అది ఉందా, లేదా అని నీకు doubt రావచ్చు. నువ్వు ఉన్నావా, లేదా అనే doubt నీకు ఎప్పుడైనా వచ్చిందా? ఇది అర్థం చేసుకోవటానికి పెద్ద తెలివి అక్కరలేదు. ఇది Commonsenseకి సంబంధించిన పాయింట్. ఇక్కడ కూర్చున్న వారిలో కాని, బయట ఎవరైనా కాని, నేను ఉన్నానా లేనా అనే అనుమానం ఎవరికి అయినా వచ్చిందా? నేను లేను అని ఎవరు అయినా అంటారా? దేవుడు లేడు అంటే ఎవరికి కోపం రాదు కాని నువ్వు లేవు అంటే మీరు ఎవరైనా ఊరుకుంటారా? ఇంత పొడుగు లెగుస్తారు. ఎంత మాట అన్నారు, నేను లేను అంటారా? అందుచేత నీ యొక్క existence మీద నీకు ఎప్పుడైనా అనుమానం వచ్చిందా? నేను లేను అని నీకు ఎప్పుడూ అనుమానం లేదు. నువ్వు ఉన్నావు అన్న సంగతి నీకు తెలుసు. అయితే నువ్వు ఎవరివో నీకు తెలుసా? నువ్వు ఉన్నావు అన్న సంగతి నీకు తెలుసు. అయితే నేను నేను అనే నువ్వు ఎవరో నీకు తెలుసా?

Worldలో greatest scientistని తీసుకోండి, లేకపోతే పెద్ద philosopherని తీసుకోండి వారిని నువ్వు ఎవరివో నీకు తెలుసా అని అడగండి. వాడు తలవంచుకోవాల్సిందే వాడికి

తెలియనప్పడు. నేను లేను అని వాడు అనడు కదా, దేవుడు మాట వదిలేయండి, నేను ఉన్నాను అని అంటాడు. ఆ నేను ఎవడో నీకు తెలుసా? ఈ మధ్యన ఒక పెద్ద మనిషి అదేంటండి నేను ఫలానా వారి అబ్బాయిని అన్నాడు, నేను ఎవరు అని తెలుసుకో అన్నప్పడు నీ దేహం ఎవరు అని అర్థం కాదు. నేను నేను అని నువ్వు అంటున్నావు చూసావు ఆ నేను ఎవరు? నేను నేను అని ఈ దేహం అనటం లేదు, నేను అని నువ్వు అంటున్నావు. ఆ నేను గురించి నీకు తెలుసా? ఈ నేను దేహం తోటి పెనవేసుకుపోయింది, మనసు తోటి పెనవేసుకుపోయింది, నాకున్న కోరికలు తోటి పెనవేసుకుపోయింది, నాకున్న కాంక్షల తోటి పెనవేసుకుపోయింది, దానికి చుట్టుకుపోయింది అంటే దేహం పుట్టినప్పుడు నేను పుట్టాను అనుకుంటున్నాను. దేహం మరణించినప్పుడు నేను మరణించాను అనుకుంటున్నాను. నేను ఈ దేహానికే పరిమితం అయిపోయాను. గాఢనిద్రలో నేను లేను అని ఎవడైనా అనగలడా? నిద్రలో నీకు ఏ సమస్యలు లేవు. దేవుడు లేకుండా నువ్వు ఉన్నావు. నీ దేహం లేకుండా నువ్వు ఉన్నావు. నీ మనస్సు లేకుండా నువ్వు ఉన్నావు. నీ కోరికలు లేకుండా నువ్వు ఉన్నావు. నేను Indian అని, నేను అమెరికన్ అని, నేను ఇంగ్లాండు వాడిని అని, నీ జాతి కాని, నీ కులం కాని, నీ రంగు కాని, నీ sex కాని, ఏ గొడవలు లేకుండా నువ్వు గాఢ నిద్రలో ఉన్నావు కదా. అప్పడు ఎక్కడ ఉన్నావు?

మేము చనిపోయిన తరువాత ఏమి అవుతాము అని చాలామంది అడుగుతారు. మేము చనిపోయిన తరువాత ఏమి అవుతాం అని ప్రశ్న వచ్చినప్పడు రోజూ మీరు నిద్రలో ఎక్కడ ఉంటున్నారు? మీరు నిద్ర పోతున్నారు కదా, ఆ నిద్రలో మీరు ఉన్నారా లేదా అంటే ఉన్నారు. ఎక్కడ ఉన్నారు? నిద్రలో ఎవరైనా మాకు ఇంత ఆస్తి ఉంది అనుకుంటున్నారా? నిద్రలో మీ దుఃఖం అంతా ఎక్కడికి వెళ్లిపోయింది. మీ బంధువులు అందరూ ఎక్కడికి వెళ్లిపోయారు. మీ స్నేహితులు అందరూ ఎక్కడికి వెళ్లిపోయారు. మరి మీ ఆస్తి అంతా ఎక్కడికి వెళ్లిపోయింది, నువ్వు ఎక్కడ ఉన్నావు? మన అందరికి ఆధారాలు ఉన్నాయి, ఎవరికైనా దేవుడు ఆధారామా? బ్యాంకు అకౌంటు మనకి ఆధారం, బంధువులు ఉంటే బంధువులు ఆధారం, స్నేహితులు ఉంటే స్నేహితులు ఆధారం. మనకి ఏమైనా పదవులు ఉంటే ఆ పదవులు ఆధారం మనకి, ఏమైనా property ఉంటే property ఆధారం. అంతేగాని దేవుడు ఆధారంగా ఎవరైనా జీవిస్తున్నామా?

Teen age is worst age. ఎందుకంటే మనకి తెలియదు, పెద్ద వాళ్ళు చెబితే బుర్రకు ఎక్కదు. మనకు యవ్వనం వచ్చే వయసు అది, అటువంటి వయసులోనే రమణస్వామికి జ్ఞానం కలిగింది. యవ్వనం వచ్చే వయసులో, ఈయన ఆత్మ సింహాసనం మీద అధిపతి


అయ్యాడు అంటే ఆ ఔన్నత్యం, అందులోని beautyని మీరు ఒకసారి చూడండి. ఓ అరుణాచలేశ్వరుడా! నాకు ఏమి స్నేహాలు లేవు, నాకు ఏమి ఆధారాలు లేవు, నాకు ఇది ఉంది అని చెప్పకోడానికి ఈ లోకంలో నాకు ఏమి లేదు. అటువంటి స్థితిలో అటువంటి వయసులో, నీ పట్ల నాకు ఆశ కలిగించావు. నేను టీనేజ్‌లో ఉన్నప్పడు నిన్ను తెలుసుకోవాలి అనే కాంక్ష కలిగింది. ఎన్ని జన్మలలో చేసిన పుణ్యమో, ఎంత కృషి చేస్తే ఆ వయసులో ఆయనకు కలిగిందో! మన అందరికి ఆధారాలు ఉన్నాయి. ఏవండీ మీకు ఏది ఆధారం అంటే నాకు Indian బ్యాంకులో లక్షా యాభై వేలు ఉంది అంటాడు. ఏవండీ మీకు ఏమి ఆధారం అంటే, నాకేమో నాలుగు ఎకరాలు పొలం ఉంది, ఏమి ఫరవాలేదు అంటాడు. లేకపోతే ఏమి అంటాడు మా అబ్బాయిలు నాలుగేసి వేలు జీతాలు తెచ్చుకుంటున్నారు, నాకు నెలకు వెయ్యి పంపిస్తున్నాడు ఏమి ఫరవాలేదు అంటారు. ఇలా ప్రతీవాడి మనసు కూడా ఏదో ఒక రకంగా లోకానికి సంబంధించిన విషయాల మీదే ఆధారపడి ఉంటుంది కాని నాకు ఆధారం ఈశ్వరుడు ఉన్నాడు, భగవంతుడు ఉన్నాడు అని ఎవరి మనసు అయినా భగవంతుడు మీద వాలుతోందా? బ్యాంకు అక్కౌంట్ నేను సెక్యూరిటీ అనుకుంటున్నాను కాని నాకు భగవంతుడే సెక్యూరిటీ అనే భావన ఎవరికి అయినా కలుగుతోందా? అది చాలా కష్టం. మనకి డబ్బు మీద ఆశ ఉంటుంది. గౌరవం మీద ఆశ ఉంటుంది, కీర్తి మీద ఆశ ఉంటుంది. ఏదో గొప్పల మీద ఆశ ఉంటుంది. ఏదో పదవి కావాలి అని ఆశ ఉంటుంది. ఈ లోకానికి సంబంధించిన ప్రతీ విషయంలోనూ, స్వల్ప విషయంలోనూ ఏదో ఒకటి సాధించాలి అని మనం బాధ పడుతున్నాం కాని ఈశ్వరుడి పట్ల ఆశ హృదయంలో ఎంతమందికి ఉంది? నాలో అహంకారం ఉన్నంత కాలం భగవంతుడి మీద ఆశ కలుగుతుందా? అన్ని దెబ్బలు తగిలాక మొఖం అటు తిరుగుతుంది కాని మాములుగా బాహ్యంగా దెబ్బలు తగలకపోతే మొఖం అటు తిరగదు. దెబ్బలు తిన్నాక మనం చేసేది ఏమి లేనప్పడు, మనలని ఎవరు పలకరించనప్పడు, ఈ సమాజం మనలని వదిలేసినప్పడు, ఎవరు మనలని పలకరించనప్పడు ఎప్పడైనా అంటామేమో కృష్ణా అని, రామా అని, అదైనా ఎప్పడో అంటాము.

ఓ అరుణాచలేశ్వరుడా! నేను నిన్ను నమ్మి వచ్చాను. నా కుటుంబాన్ని విడిచి పెట్టాను. నా బంధువులను విడిచి పెట్టాను. నా అనేది అంతా విడిచి పెట్టాను. అన్నీ విడిచి పెట్టి భయం లేకుండా నీ పాదాల దగ్గరకు వచ్చాను. ఇప్పడు నన్ను కాదు అని గెంటేయకు అరుణాచల, నన్ను మోసం చేయకుండా ఈ లోకం తోటి నన్ను కలిసిపోనివ్వకుండా నాకు జ్ఞానాన్ని ప్రసాదించు. ఈ వ్యక్తి భావనను తీసేయ్, ఈ అహంకారాన్ని తీసేయ్, అహంకారం

పోగొట్టుకోవడం సామాన్యమైన విషయం కాదు. అహంకారమే అజ్ఞానం, అహంకారమే చీకటి. ఇవన్నీ అహంకారం లోంచే వస్తున్నాయి. సమస్త రుగ్మతలు అహంకారం నుండే వస్తున్నాయి. ప్రపంచంలో ఉన్న అశాంతికి, ప్రపంచంలో ఉన్న దుఃఖానికి, అంతటికీ ఒకటే కారణం. అది అహంకారం. అటువంటి పరిస్థితుల్లో నీ పట్ల బలీయమైన ఆకర్షణ కలుగజేసి నా అహంకారాన్ని తీసేసి నాకు జ్ఞానాన్ని ప్రసాదించు. ఈ వ్యక్తి భావనను తీసేయ్. ఈ అహంకారాన్ని తీసేయ్ అని రమణస్వామి ప్రార్థిస్తున్నాడు. అరుణాచలం అని స్మరిస్తే చాలు దానివల్ల మీకు మోక్షం వస్తుంది. మీరు అరుణాచలం యొక్క రూపాన్ని ధ్యానం చేస్తూ, అరుణాచలం యొక్క నామాన్ని స్మరిస్తుంటే మీరు మీ రూపం లోంచి, మీ నామం లోంచి విడుదల పొందుతారు. ఇదే రహస్యం. ఎంతసేపు నేను నా రూపం చుట్టూ తిరుగుతున్నాను. నా నామం చుట్టూ తిరుగుతున్నాను. ఇంకా లోకానికి సంబంధించిన విలాసమైన వస్తువుల తోటి నా అహంకారాన్ని అలంకరించుకుంటున్నాను.

మీరు ఎవరినైన పొగడండి వాళ్లకి సంతోషం వస్తుంది ఎందుకంటే అహంకారం ఉబ్బుతుంది. మీరు ఎవరిని అయినా తిట్టండి వాడు కృంగి పోతాడు, పరమేశ్వరుడు మనలని అనేక దెబ్బలు కొడుతూనే ఉంటాడు దాని నుండి మనం పాఠాలు నేర్చుకోవాలి. అన్నీ బాగున్నప్పుడు మనకు ఏమీ తెలియదు. ఆరోగ్యం ఉన్నప్పుడు ఆరోగ్యం విలువ మనకి తెలియదు. ఆరోగ్యం లేనప్పుడు ఆరోగ్యం విలువ తెలుస్తుంది. జేబులో రూపాయలు ఉన్నప్పుడు రూపాయల విలువ మనకి తెలియదు. జేబులో రూపాయి లేనప్పుడు తెలుస్తుంది రూపాయి విలువ. అదే విధంగా మనం యవ్వనంలో ఉన్నప్పుడు మన మాట నలుగురిలో చెల్లుబాటు అవుతుంది. అప్పుడు మనకి దేవుడు అక్కర్లేదు. మనకి దుఃఖం వచ్చినప్పుడు, అశాంతి వచ్చినప్పుడు దేవుడు కావాలి. నా అహంకారం సాగుతున్నంతకాలం నాకు సమాజం అక్కర్లేదు, దేవుడు అక్కర్లేదు, ధర్మం అక్కర్లేదు, న్యాయం అక్కర్లేదు. ఎంతకాలం? నా అహంకారం దెబ్బలు తిన్నప్పుడు, దానికి లేచే ఓపిక లేనప్పుడు దేవుడి వంక చూస్తుంది. నువ్వు బాహ్యంగా తీసే గుంజీల వల్ల, నువ్వు బాహ్యంగా పెట్టే నమస్కారాల వల్ల భగవంతుడు మోసపోడు.

దుఃఖం ఎందుకు వస్తుంది? కొన్ని తలంపులు మీరు కోరుకోరు. ఈ తలంపు



**మనకి సత్వగుణం ఉన్నప్పుడు సబ్జెక్టు అర్థం అవుతుంది. కాని, రజోగుణం, తమోగుణం ఉన్నప్పుడు సబ్జెక్టు విన్నా మనకి అర్థం అవ్వదు. అందుచేత సత్వగుణం లేకపోతే, దానిని మనం కల్టివేట్ చేసుకోవాలి. సత్వగుణం మాత్రమే ఆత్మజ్ఞానానికి దారి చూపిస్తుంది.**

వద్దు, ఈ తలంపు వద్దు అని మీరు అనుకుంటూ ఉంటారు ఆ తలంపే వచ్చి మీ నెత్తిమీద కూర్చొంటే అప్పుడు దుఃఖం వస్తుంది. ఆ తలంపుని remove చేసుకోలేరా మీరు? మీ హృదయంలో ఏ తలంపు ఉందో, ఏ తలంపు మీ శిరస్సులోకి వస్తోందో, ఏ తలంపుని రానివ్వకూడదో ఏ తలంపుని తెచ్చుకోవాలో ఇదంతా అసలు మీ కంట్రోల్‌లో ఉందా? ఇక్కడ ఇంతమంది మనం కూర్చున్నాం. ప్రాణం పోయేటప్పడు ఎవరికైనా తెలుస్తుందా? పోనీ ప్రాణం దాకా వెళ్లవద్దు నిద్ర వచ్చే టైము ఎవరైనా చెప్పగలరా? ఏ సెకనులో నిద్ర వస్తుందో నాకు తెలియదు. ఏ సెకనులో ప్రాణం పోతుందో నాకు తెలియదు అవి రెండు వదిలివేయండి ఏ తలంపు ఎప్పడు నాకు వస్తుందో నాకు తెలియదు. అది కూడా మన controlలో లేదు. మన భారాలు, మన బంధాలు మన సంకెళ్ళు తెంపడానికి ఈశ్వరుడే రావాలి. నా అహంకారాన్ని నేను పోగొట్టుకుంటానా? నేను సాధనలు చేసి పూజలు చేసి జపాలు చేసి నా అహంకారాన్ని పెంచుకుంటున్నానా? అమ్మగారు మీరు చాలా జపం చేశారు అంటే అవునండి తెల్లవారుఝామున మూడు గంటలకు లేస్తాను అంటారు. మీకు కనుక నిజంగా భక్తి ఉంటే అది ఇంకొకరికి తెలియవలసిన పని ఏముంది? అది నీకు భగవంతుడికి సంబంధించిన విషయం. కొంతమంది ఏమి అంటారు అంటే దేవుడు ఉంటే నాకు ఎందుకు కనపడడు అంటారు? దేవుడు ఉంటే వీడికి కనపడాలి అట, వీడికి కనిపించకపోతే దేవుడు లేడు అట. అంటే కనిపించేదే నిజం. కనిపించనిది అంతా అబద్ధం. ఇది మన లాజిక్. కనిపించనిది ఏమి లేదు కనిపించేదే నిజం అనుకుంటే మానవుడు సైంటిస్ట్ అవ్వ లేడు. జపం చేసుకుంటూ కొంతమంది గంటలు లెక్క పెట్టుకుంటూ ఉంటారు, అంటే మీకు గంటలు జ్ఞాపకం వస్తున్నాయా? దేవుడు జ్ఞాపకం వస్తున్నాడా? నాకు ఈ కోరిక నెరవేరితే నేను పెద్ద తిరుపతి వెళ్లి వేంకటేశ్వరస్వామిని చూసి వస్తాను అనుకుంటారు. మీకు నిరంతరం జ్ఞాపకం వచ్చేది వేంకటేశ్వరస్వామా? నీ కోరికా? మీరు ధ్యానం చేసేది వేంకటేశ్వర స్వామినా లేక మీ కోరికనా? మీ కోరికనే మీరు ధ్యానం చేస్తున్నారు కాని మీరు అనుకుంటున్నారు నేను ఈశ్వరుణ్ణి ధ్యానం చేస్తున్నాను అని, మనం ప్రయాణం చేసేది పడమర వైపుకి కాని అనుకునేది తూర్పుకి ప్రయాణం చేస్తున్నాం అని అనుకుంటున్నాం.

ఒక అమ్మగారు బాగా జపం చేసేది అట పాపం, అంటే ఆ జపం ఎటువంటిది హృదయంలోకి దిగేది కాదు formalityకి స్నానం చేసినట్టు చేసేది. అంటే అక్కడ mind ఏమి ఉండదు, రామ రామ, కృష్ణ కృష్ణ ఇలా అంటూ ఉంటుంది. నోరు అంటూ ఉంటుంది మనసు అక్కడ ఏమి ఉండదు. ఎక్కడైతే నామం ఉందో అక్కడ మనసు ఉండదు. ఈ జపానికి నాకు దేవుడు కనపడటం లేదు అని ఈవిడ అడిగిన ప్రశ్న. రోజూ దేవుడు కనపడటం

లేదు అనే తలంపు ఆవిడకి వస్తోంది అని ఒకరోజు నిజంగా ఆయన కనిపించాడు. జపం అయిపోయిన తరువాత రోజూ ఇల్లు తుడుచుకుంటుంది. ఇంట్లో చీపురు కట్ట లేదు. దేవుడు నీకు ఏమి కావాలి అంటే రోజూ ఇల్లు తుడుచుకోవాలి కదా చీపురు కట్ట కావాలి అంది. అంటే ఆవిడకి తెలియకుండా ఆవిడ చీపురు కట్టనే ధ్యానం చేస్తోంది. నిజంగా దేవుడు కనిపించి నీకు ఏమి కావాలి అంటే ఆవిడ మనసులో ఉన్నదే ఆవిడకి వచ్చింది. ఇది మీరు జ్ఞాపకం పెట్టుకోండి. మన మనసులో ఉన్నదే మనకు బయటకు వస్తుంది మనం మరణించేటపుడు కూడా అంతే. మనకు దేవుడు జ్ఞాపకం రాడు. నీ హృదయంలో ఏముందో, దేని కోసం నువ్వు జీవించావో, దేని కోసం నువ్వు పెరిగావో, నువ్వు మరణించే గడియలో, మరణించే మినిట్ లో అదే నీకు జ్ఞాపకం వస్తుంది కానీ దేవుడు నీకు జ్ఞాపకం రాడు. ఏ జీవి అయితే చివరి శ్వాసలో ఏ జీవుడు అయితే చివరి నిమిషంలో నన్ను స్మరిస్తున్నాడో వాడు నన్ను పొందుతాడు అని భగవంతుడు వాసుదేవస్వామి చెప్పాడు. కరెక్టే కానీ అది ఆచరణలో మనం చేయలేము. ప్రాణ ప్రయాణ టైములో దేవుడు జ్ఞాపకం వస్తాడు అని ఎవరు అనుకోవద్దు. కాని మీ మనసులో ఏదైతే ఉందో, మీ మనసులో దేనిని అయితే ధ్యానం చేస్తున్నారో మీ మనసులో ఏదైతే బలీయంగా ఉందో అది మాత్రమే తుది శ్వాస విడిచి పెట్టినప్పుడు మీకు జ్ఞాపకం వస్తుంది. మిగతా కోరికలు తప్పించేసి వాటిని తొక్కేసి బలీయం అయినటువంటి కోరిక మీ మనస్సును ఆక్రమిస్తుంది. దేవుడిని తెలుసుకోవాలి అనే కోరిక మీకు ఉండవచ్చు. కాని ఆ కోరిక అగాధంలోకి ఆ depthలోకి తొక్కేయబడుతుంది. నీకున్న బలమైన కోరిక మటుకు నీ బ్రెయిన్ లోకి వచ్చి అది మిమ్మల్ని దెయ్యం లాగా ఆడించి, ఆ కోరికను పట్టుకుని మీ మనస్సు పునర్జన్మలోకి వెళ్ళిపోతుంది. మేము ఏదో కృష్ణా రామా అనుకుంటున్నాం, మేము ఏదో వెంకటేశ్వరస్వామిని ధ్యానం చేస్తున్నాం మరణ కాలంలో దేవుడు జ్ఞాపకం వచ్చేస్తాడు అని మీరు ఎవరూ అనుకోవద్దు. మీకు తెలియకుండా secret burdens మీ హృదయంలో ఉన్నాయి. ప్రాపర్టీస్ ఉన్నాయి, మీ గౌరవాలు ఉన్నాయి. ఎన్నో గొడవలు మీ హృదయంలో ఉన్నాయి. ప్రతీ వాడి హృదయం సత్రం లాంటిదే. హృదయంలో ఇటువంటి గొడవలు ఉన్నటువంటి మీకు భగవంతుడే జ్ఞాపకం వస్తాడు అని ఎవరూ అనుకోవద్దు. నీకు ఏమి కావాలి అని పరమేశ్వరుడు అడిగాడు. వెంటనే ఈవిడ బుర్రలో చీపురు కట్ట ఉంది, నాకు చీపురు కట్ట కావాలి అంది. కాని దేవుడు కరుణామయుడు కదా, మోక్షం అడుగుతుంది అని నేను దర్శనం ఇచ్చాను. నాకు మోక్షం కావాలి అని అడగాలి, ఇదేమిటి కష్టపడి జపం చేస్తోంది. కానీ తీరా కనిపించి నీకు ఏమి కావాలి అంటే చీపురు కట్ట అడుగుతోంది అని ఇంకో ఛాన్స్ ఇచ్చాడు. రెండోసారి అడిగితే మోక్షం

కోరుకుంటుంది ఏమో అని, ఇంకొక సారి మళ్ళీ అడిగాడు ఏమి కావాలి అని మళ్ళీ చీపురు కట్ట అడిగింది. మన జీవితాలు అంతే, మన మనసులో ఉన్నదే వస్తుంది.

మీరు చేసే పని సక్రమంగా చెయ్యటం కూడా ధ్యానంలో భాగమే. మీరు ఏ పని చెయ్యనివ్వండి లౌకికమైన పని చేసినా సరే మీరు చేసేది సమగ్రంగా చేస్తే అది కూడా ధ్యానమే. మీరు కళ్ళు మూసుకుని కూర్చోవటమే ధ్యానం కాదు. మీరు కళ్ళు మూసుకుని కూర్చున్న, కళ్ళు తెరచి ఉన్నప్పటికీ మీ మనసు నిదానంగా ఉండాలి. ధ్యానం మంచిదే ధ్యానం కాదు అనలేదు భగవాన్ కాని ధ్యానం కూడా కల్పితమే. ధ్యానం అంటే మూడు ఉండాలి. చేసేవాడు ఉండాలి, చెయ్యబడేది object ఒకటి ఉండాలి, చేయటం అనే క్రియ ఒకటి ఉండాలి. ఈ మూడు ఉంటేనే ధ్యానం కుదురుతుంది. ఇవి మూడు mind యొక్క క్రియేషన్స్, మనసు యొక్క కల్పితాలు. భగవంతుడిని మీరు ధ్యానం చేయాలి అంటే భగవంతుడి మీద మీకు ఇష్టం కుదరాలి. ఇష్టం లేకుండా కష్టం తోటి ఎన్ని రోజులు చేయగలరు? ఇష్టమైన సినిమా మీరు చూసినప్పుడు ప్రశాంతంగా ఉంటున్నారు. మీరు ధ్యానం చేసేటప్పుడు అంత సహజంగా మీరు ఎందుకు ఉండటం లేదు? కారణం మీకు ఇష్టం లేదు. మీ మనసుకి భగవంతుడి యందు ఇష్టం కలగాలి. అది మీరు తెచ్చి పెట్టుకున్నట్టు ఉండకూడదు. ఏదో కష్టపడి చేసినట్టుగా ఉండకూడదు. కృత్రిమంగా కనుక మనం ఉంటే దేవుడిని స్మరించలేము, దేవుడిని ధ్యానించలేము. మన జీవితానికి, ధ్యానానికి దగ్గర సంబంధం ఉంది. మన జీవితం సరళంగా ఉన్నప్పుడు, మన జీవితం సహజంగా ఉన్నప్పుడు, మన జీవితంలో కృత్రిమ పద్ధతి లేనప్పుడు, మనం artificial జీవితానికి దూరంగా ఉన్నప్పుడు, natural జీవితానికి, normal జీవితానికి, simple జీవితానికి మనం అలవాటు పడినప్పుడు అట్టి వాడికి మాత్రమే ధ్యానం కుదురుతుంది. ధ్యానం అంటే ఏమిటి? మీకు అక్కర్లేని తలంపులు తొలగించి, మీ ఇష్ట దైవం మీద మీరు మనసుని నిలబెట్టి ఉంచడమే ధ్యానం.

భగవాన్ ఒక సందర్భంలో చెప్పారు. ఈ అరుణాచలం వచ్చేవారు రిక్త హస్తాల తోటి బయటకు వెళ్ళరు. ఈ అరుణాచలం వచ్చినవారు వాళ్లకి తెలిసున్నా, తెలియకపోయినా వట్టి చేతుల తోటి బయటకు వెళ్ళరు. నాస్తికుడు ఆస్తికుడు అవుతాడు. ఆస్తికుడు భక్తుడు అవుతాడు. భక్తుడు జ్ఞాని అవుతాడు. జ్ఞానం కలిగినవాడిని జ్ఞాని అంటారు, భక్తి కలిగినవాడిని భక్తుడు అంటారు. యోగం ఉన్నవాడిని యోగి అంటారు. ఎవడికి అయితే జ్ఞానం కలిగిందో వాడు నా స్వరూపం పొందుతాడు అని వాసుదేవుడు కూడా మీకు గీతలో చెప్పాడు. అదే రమణస్వామి చెప్పారు ఈ గేటులోకి వచ్చిన వాడు, ఈ క్షేత్రానికి వచ్చిన వాడు ఎవడు వాడికి తెలిసున్నా, తెలియకపోయినా వట్టి చేతుల తోటి బయటకు వెళ్ళడు. వాడు నాస్తికుడు

అయితే ఆస్తికుడు అవుతాడు. ఆస్తికుడు అయితే భక్తుడు అవుతాడు. భక్తుడు అయితే జ్ఞాని అవుతాడు జ్ఞాని అయిన వాడు అరుణాచలేశ్వరుడి యొక్క స్వరూపం పొందుతాడు. మీకు తెలియటం మీకు తెలియకపోవటం తోటి సంబంధం లేదు. మనకి తెలిసుండి చెరువులో పడినా లేకపోతే మనం accidentalగా చెరువులో పడ్డాం అనుకోండి ఎలా అయినా స్నానమే, తడపటం నీటి యొక్క స్వభావం. అదే విధంగా అరుణాచల అని ఎవరైతే స్మరిస్తున్నారో వాడు తప్పనిసరిగా పరిపూర్ణమైన స్థితిలోకి వస్తాడు. సర్వ సాధారణంగా రమణమహర్షి జ్ఞానే కాని భక్తి గురించి ఏమి చెప్పరేమో అనుకుంటారు రమణమహర్షి ఎంత జ్ఞానో అంత భక్తుడు కూడా, పరిపూర్ణమైన భక్తికి పరిపూర్ణమైన జ్ఞానానికి రెండింటికి బేధం లేదు. రమణస్వామి చెప్పారు తల్లి లేకుండా బిడ్డ వస్తుందా అని, తల్లేమో భక్తి బిడ్డ జ్ఞాని.

భగవాన్ తల్లి తోటి రంగన్ చెప్పాడు మీ అబ్బాయి ఆధ్యాత్మికంగా అతి బలిష్టుడు, ఎంతో ఉన్నత స్థితికి వచ్చాడు అయితే మీ అబ్బాయి సంపాదించుకున్న దాంట్లో నాకు వాటా పెట్టాలి. అని భగవాన్ తల్లిని అడిగాడు రంగన్. ఈ రంగన్ ఏమి అడుగుతున్నాడో చూశావా, చిన్నపుడు నీతో చదువుకున్న అబ్బాయి, నువ్వు సంపాదించుకున్న దాంట్లో వాడు వాటా అడుగుతున్నాడు అని భగవాన్ తోటి వాళ్ళ అమ్మ చెప్పింది. అప్పుడు భగవాన్ అన్నారు నిజమే మరి, వాడికి కూడా వాటా ఉంది. వాడు కూడా మనవాడే!

అలా మీరా కృష్ణుడిని స్మరిస్తూ కృష్ణుడి కోసం జీవించింది. కృష్ణుడి కోసం మరణించింది. నిరంతరం కృష్ణ స్మరణ ఒక అవతారం తోటి ఒక జ్ఞాని తోటి అనుబంధం పెట్టుకోవటం వల్ల కేవలం మీరాబాయి జ్ఞాని అయ్యింది. దేవుడిని స్మరించగా స్మరించగా ఎక్కడో వైకుంఠం నుంచో, కైలాసం నుంచో వస్తాడు మనకి దర్శనం ఇస్తాడు అని మీకు భావన ఉండవచ్చు. మీ మనసుని నొక్కండి. మీ మనసులోని కల్మషం బయటకు వచ్చేస్తుంది. మీ మనసులో ఉన్నటువంటి కల్మషం ఎప్పుడైతే బయటకు కక్కబడిందో, దేవుడు ఎక్కడ నుంచో రాడు already present, Always present. దేవుడు ఎక్కడో లేడు నీ హృదయంలోనే ఉన్నాడు. ఇప్పుడు ఉన్నాడు సదా ఉన్నాడు మీ కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ కల్మషం ఎప్పుడైతే మనలోంచి బయటకు తప్పకుందో, దానిని ఎప్పుడైతే మనం eliminate చేయ్యగలిగామో అప్పుడు సహజంగా ఉన్న ఈశ్వరుడు ఎక్కడ నుంచో రాడు ఇక్కడే వ్యక్తం అవుతాడు. గురువు గురువు అంటే ఎవరో కాదు మీ మనసుని ఎవడైతే అంతర్ముఖ పరచగలుగుతాడో వాడే గురువు. బాహ్యంగా తిరుగుతున్నటువంటి మీ మనసుని ఎవడైతే అంతర్ముఖం చెయ్యగలుగుతాడో వాడే గురువు. మీ మనసు బాగుపడటం కోసం, మీ మనసు వికసించటం కోసం, మీ మనసులో పరిమళం రావటం కోసం మీ మనసు

ఉన్నతమైన జ్ఞాన శిఖరాలకి ఎదగటం కోసం ఒక్క అరుణాచల స్మరణ సరిపోతుంది. అయితే మీరు ఇతర స్మరణ చెయ్యకూడదు అని కాదు, మీరు చెయ్యవచ్చు కానీ మీకు సెంటు పర్సెంటు మార్కులు రావటం కోసం మీకు మోక్షానికి తగ్గ మార్కులు రావటం కోసం ఇది సరిపోతుంది. ఇతరత్రా మీకు ఏవైనా అభిరుచులు ఉంటే మీరు చేసుకోవచ్చు. అయితే ఇది సంకుచితమైనటువంటి మార్గం కాదు.

అరుణాచలేశ్వరుడి పట్ల కొంతమందికి ఎంత ఇష్టం ఉంటుందో, రాముడి పట్ల కాని, కృష్ణుడి పట్ల కాని, యేసు పట్ల కాని మీకు అంత ఆప్యాయత ఉంటే వాడు తప్పనిసరిగా పరిపూర్ణమైన స్థితిలోకి వస్తాడు. జ్ఞాని పట్ల అవతార పురుషుడు పట్ల ఆపుకోలేని ప్రేమ, అడ్డం ఏది వచ్చినా తొలగించుకోగలిగిన ప్రేమ, నిదానమైన ప్రేమ, విడదీయరానటువంటి బంధం ముందు మనకి ఏర్పడాలి. అంతేగాని మనకి ఏదో చెప్పడు మాటలు వినటం వల్ల ఎవడో దేవుడు లేడు అంటే చలించిపోయే Faithతో మటుకు మనం గట్టు ఎక్కలేము. విశ్వాసం అవసరం, విశ్వాసం లేకపోతే ఎదగలేము. Reason ఎంత అవసరమో విశ్వాసం కూడా అంతే అవసరం. Reason కూడా విడిచి పెట్టవలసిన అవసరం లేదు. మెటాఫిజిక్స్‌లో reasonని విడిచిపెట్టమని ఎక్కడా లేదు. Reason కూడా అవసరమే. Faith కూడా అవసరమే. వీటిని ఆధారంగా చేసుకుని మనం మనసులో వికాసం పొందాలి.

నాకు దేవుడిని తెలుసుకోవాలని ఉంది అని ఒకరు భగవాన్‌ని ప్రశ్నించారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే, దేవుడిని తెలుసుకోవాలి అని నువ్వు అంటున్నావు. దేవుడు ఎప్పుడైనా వచ్చి నిన్ను అడిగాడా నన్ను తెలుసుకోవయ్యా అని? ఆయన నన్ను ఎప్పుడూ అడగలేదు. మరి ఎందుకు నీకు ఆ కోరిక కలుగుతోంది? ఆయనొచ్చి నిన్ను ఏమి రిక్వెస్ట్ చెయ్యట్లేదు నన్ను తెలుసుకో అని, అయితే దేవుడిని ఎందుకు తెలుసుకోవాలి అని నువ్వు ప్రయత్నం చేస్తున్నావు? ఎందుచేత అంటే సృష్టి ప్రారంభం అయినప్పటి నుంచి ఈనాటి వరకు మానవుడు చేసే ప్రయత్నం ఒక్కటే. దుఃఖంలోంచి తప్పించు కోవటం మానవుడి యొక్క పరమావధి. అన్న వస్త్రాలు సంపూర్ణంగా ఉన్న వాళ్ళు లేరా? అధికారాలు ఉన్న వాళ్ళు లేరా? అన్ని గౌరవాలు ఉన్న వాళ్ళు లేరా? అన్నీ ఉన్నాయి, అన్నీ ఉన్నప్పటికీ దుఃఖం వస్తోంది. మానవుడు దుఃఖ పడుతున్నాడు. ప్రపంచంలో అన్నిచోట్లా దుఃఖం ఉంది. ఈ దుఃఖానికి కారణం ఏమిటి? దుఃఖం లేని స్థితికి మానవుడు వచ్చేవరకు ఈ అన్వేషణ సాగుతూనే

**మైత్రీ భావన ఉన్నవారికి జీవలక్షణాలు నశిస్తాయి, విరోధ భావం ఉన్న వారికి జీవ లక్షణాలు పెరుగుతాయి.**



ఉంటుంది. అందుచేత దుఃఖం లేని స్థితికి నువ్వు ఎదగటం కోసం దేవుడు కూడా అందులో భాగం మాత్రమే. దేవుడు దర్శనం ఇస్తే నాకు దుఃఖం పోతుంది. నాకు బాధ పోతుంది, నాకు అశాంతి పోతుంది. నాకు ఆందోళన పోతుంది అనేటటువంటి తపన కొలది నువ్వు దేవుడిని కోరుకుంటున్నావు. అంటే నీకు తెలియకుండా నువ్వు దేవుడు, దేవుడు అని దుఃఖం లేని స్థానం పొందటం కోసం నువ్వు ప్రయత్నం చేస్తున్నావు. దుఃఖం లేని స్థానం ఎక్కడ ఉంది? అది మీ హృదయంలోనే ఉంది. అయితే అది మనకి ఎందుకు అందటం లేదు? మనం బాహ్య దృష్టికి అలవాటు పడిపోయాం. బాహ్య దృష్టికి అలవాటు పడిపోవటం వల్ల వస్తువు ఎంత సమీపంలో ఉన్నప్పటికీ మనకి తెలియటం లేదు. దానిని అందుకొనే వరకు మీ ప్రయాణం సాగుతూనే ఉంటుంది.

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒక మాట చెప్పాడు ఈ లోకంలో జ్ఞానం ఎవరికీ అక్కర్లేదు. దానికి కారణం ఏమిటి అని ఆయననే ప్రశ్నించారు. జ్ఞానం విలువ ఎవరికీ తెలియటం లేదు. మనం అందరం డబ్బు, డబ్బు అంటున్నాం డబ్బు కోసం చాలా కష్టాలు పడుతున్నాం. డబ్బు కోసం అబద్ధాలు చెబుతాం, డబ్బు కోసం ఎన్ని చెడ్డ పనులు అయినా చేస్తాం, డబ్బు కోసం ఎన్ని కష్టాలు అయినా భరిస్తాం. ఎందుకు డబ్బు కోసం అంత శ్రమ పడుతున్నాం అంటే డబ్బు విలువ మనకి తెలుసు కాబట్టి. అదే విధంగా జ్ఞానం యొక్క విలువ నీకు తెలిస్తే జ్ఞానం యొక్క వైభవం నీకు తెలిస్తే, జ్ఞానం యొక్క అంతస్తు తెలిస్తే, జ్ఞానం పొందటం వలన వచ్చే లాభం నీ హృదయానికి తెలిస్తే, అప్పుడు జ్ఞానం సంపాదించడం కోసం నువ్వు ప్రయత్నం చేస్తావు అని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పాడు. మీకు దాని విలువ తెలియాలి. వస్తువు యొక్క విలువ మీకు తెలియకపోతే దానిని పొందాలి అనే ప్రయత్నం చెయ్యరు. జ్ఞానం యొక్క విలువ తెలుసుకోండి, జ్ఞానం యొక్క గొప్పతనం మీరు తెలుసుకోండి, దానికి ఉన్న శక్తిని మీరు తెలుసుకోండి, జ్ఞానానికి మించిన శక్తి ఈ సృష్టిలో ఏమి లేదు. అయితే జ్ఞానం యొక్క విలువ మీకు తెలిస్తేనే దానిని సంపాదించాలి అనే కోరిక మీలో వస్తుంది.

రమణస్వామిని ఒకరు ఏమని ప్రశ్నించారు అంటే ఏవండీ మీరు కోరికలను విడిచి పెట్టుకోమంటున్నారు. మరి మేము అరుణాచలం రావటం కూడా ఒక కోరికే కదా, మీరు కోరికలను విడిచి పెట్టుకోమంటే ఇది మటుకు కోరిక కాదా? దీనికి భగవాన్ అన్నారు నువ్వు పోగొట్టుకోవాల్సిన కోరికలు అనేకం ఉన్నాయి. వాటిని అన్నిటిని వదిలేసి నువ్వు ముందు భగవంతుడిని తెలుసుకోవాలి, సత్యాన్ని తెలుసుకోవాలి అనే కోరికను నువ్వు పోగొట్టుకుంటావా? నీకు ఉన్న అన్ని కోరికలు పోగొట్టుకో ఆఖరున ఇదీ పోతుంది. ఎక్కడ భయాలు లేవో, ఎక్కడ కోపాలు లేవో, ఎక్కడ కామాలు లేవో, ఎక్కడ క్రోధాలు లేవో, ఎక్కడ

ఈర్ష్యలు లేవో, ఎక్కడ అసూయలు లేవో, ఎక్కడ లోకాలు లేవో, ఎక్కడ దేవతలు లేరో, అటువంటి మహోన్నతమైన స్థితికి మిమ్మల్ని తీసుకు పోవడమే రమణస్వామి చేసే పని. ఉత్తమ స్థితిని మీకు కలుగజేయటం కోసం మీకు తెలియకుండా మీ చేత ప్రయాణం చేయించటం కోసం రమణస్వామి యొక్క ప్రణాళిక అది. లోకం ఏ విధంగా అయితే తలంపో, దేవుడు కూడా ఒక తలంపే. దేవుడు లేని స్థితికి మిమ్మల్ని తీసుకుపోవడం కోసం రమణస్వామి యొక్క ప్రణాళిక అది. ఏవండీ నాకు నిన్న చాలా కోపం వచ్చేసింది అంటారు. నీకు తలంపు వచ్చాక కోపం వచ్చిందా? తలంపు లేకుండా కోపం వచ్చిందా? కోపం కూడా తలంపే. తలంపు లేకుండా కక్ష ఉందా? తలంపు లేకుండా ద్వేషం ఉందా? తలంపు లేకుండా కామం ఉందా? తలంపు లేకుండా భయం ఉందా? మీకు నిద్రలో తలంపు లేదు, అక్కడ భయం లేదు. నిద్రలో తలంపు లేదు, అక్కడ కామం లేదు, నిద్రలో తలంపు లేదు అక్కడ ద్వేషం లేదు. ఏవండీ ఆడవాళ్ళు ఎవరైనా నిద్రలో మేము ఆడవాళ్ళం అనుకుంటున్నారా? లేకపోతే మేము ఇండియాలో ఉన్నాం, అమెరికాలో ఉన్నాం అనుకుంటారా? లేదు. ఒక్క ఆత్మ తప్పించి మిగతా అంతా కూడా మనసు యొక్క కల్పితమే, దేశాల యొక్క సరిహద్దులు మనసు యొక్క కల్పితం, ఈ కులాలు మనసు యొక్క కల్పితం, ఈ మతాలు మనసు యొక్క కల్పితం, ఒక్క ఆత్మ తప్పించి, ఒక్క truth తప్పించి, మొత్తం సమస్తం సృష్టిలో అన్నీ కూడా మనసు యొక్క కల్పితం. అయితే మనం నిజాన్ని తెలుసుకునే వరకు దుఃఖం మనల్ని విడిచి పెట్టదు. బాధలు మనలని విడిచి పెట్టవు. ఒకసారి రమణస్వామిని అడిగారు బ్రహ్మ దేవుడు కాని, విష్ణు దేవుడు కాని, శివ దేవుడు కాని మీకు ఎప్పుడైనా కనిపిస్తారు అనుకోండి, మీరు ఏమైనా కోరుకుంటారా అని అడిగారు. తప్పనిసరిగా కోరుకుంటాను అన్నారు. ఏమని కోరుకుంటారు? వాళ్ళు ముగ్గురు వచ్చి కనిపిస్తే, మీరు ఎప్పుడూ కనిపించవద్దు అని కోరుకుంటాను అని చెప్పారు. అది జ్ఞాని యొక్క లక్షణం. నిజంగా మీకు దేవుడు కనిపించాడు అనుకోండి మీరు ఎంతసేపు చూస్తారు? ఆయన ఎంతసేపు కూర్చొంటాడు? మీకు బాహ్యంగా ఉన్న దేవుడు మీ సుఖానికి ఎంత వరకు ఉపయోగ పడతాడు? మీకంటే వేరుగా ఉన్న దేవుడు, మీకంటే దూరంగా ఉన్న దేవుడు, మీకు ఎంత వరకు మీకు సుఖాన్ని ఇవ్వగలడు? భగవంతుడు అంటే ఏమిటో మీకు తెలియాలి, ఆయన స్వరూపాన్ని మీరు పొందాలి. మీకు ఎప్పుడైతే వస్తువు విడిగా ఉందో, అప్పుడు వేరు పడిపోవటం తప్పదు. భక్తి అంటే సామాన్యం అనుకోకండి, భక్తి అంటే పులి లాంటిది. పులి ఉన్న చోట మేకలు గొర్రెలు ఉంటాయా? నిజంగా మీకు భక్తి కనుక ఉంటే మీకు అనారోగ్యం కలుగజేసే వాసనలు ఏవి మీ దగ్గర ఉండవు.

లోకంలో ఏమి ఉంది? ఏ దేశంలో చూసినా రాగ ద్వేషాలే. అంతకంటే ఈ లోకంలో, సృష్టిలో ఏమి లేవు. మీకు comforts ఉన్నాయి అనుకోండి అంత మాత్రం చేత మీకు happiness వస్తుంది అనుకోకండి. మీకు fridge ఉంది అనుకోండి గ్యాస్ పొయ్యిలు ఉన్నాయి అనుకోండి. మంచాలు ఉన్నాయి అనుకోండి, comforts అన్నీ ఉన్నా కూడా, కంట్రోల్ లేదు అనుకోండి మీకు తప్పనిసరిగా దుఃఖం వెంటాడుతుంది. మీకు ఇంట్లో ఎన్ని సదుపాయాలు ఉన్నా సరే మీ మనసు కుదురుగా లేకపోతే తప్పనిసరిగా మీకు అశాంతి వచ్చేస్తుంది. ఎందుకంటే మీకున్న comforts కంటే మీకున్న కంట్రోల్ ఎక్కువ సుఖాన్ని తీసుకు వస్తుంది. Comforts విడిచి పెట్టమని నేను అనటం లేదు, comforts కంటే కంట్రోల్ మీకు ఎక్కువ సుఖాన్ని తీసుకు వస్తుంది. మీకు ఎయిర్ కండిషన్ ఉంది, ఫ్యాన్ ఉంది, మంచం ఉంది, పరుపు ఉంది కాని మీకు నిద్ర పట్టటం లేదు అనుకోండి, వీటి ప్రయోజనం ఏముంది? ఈ అన్నిటి యొక్క ప్రయోజనం నిద్ర పట్టడం, ఇవన్నీ ఉన్నాయి అనుకోండి మీకు నిద్ర రాదు అనుకోండి ఏమిటి ప్రయోజనం? అదే విధంగా మీకు డబ్బు ఉండవచ్చు, మీకు కీర్తి ఉండవచ్చు, మీకు comforts ఉండవచ్చు ఇంకా అనేక సదుపాయాలు మీ జీవితంలో ఉండవచ్చు. సదుపాయాలు విడిచి పెట్టుకోమని నేను అనటం లేదు. మీకు అనేకం ఉండవచ్చు, వీటి అన్నిటి యొక్క ప్రయోజనం ఏమిటి? జ్ఞానం కనుక మీరు సంపాదించకపోతే వీటి అన్నిటి యొక్క ప్రయోజనం ఏమిటి? మీకు దేహంతో వచ్చిన అవకాశాన్ని, లోకంలో వచ్చిన అవకాశాన్ని, ఈ లోకంలో ఉన్న విషయాలను అన్నిటిని మీకు అనుకూలంగా తిప్పుకుని మీరు జ్ఞానం పొందటం కోసం ప్రయత్నం చెయ్యండి. మీకు దేహం వచ్చిన తరువాత జ్ఞానం సంపాదించకుండా దేహం కనుక పడిపోతే అప్పుడు దేహం ఎందుకు వచ్చినట్టు? దేహం యొక్క ప్రయోజనం ఏమిటి? మీకు ఎన్ని సుఖాలు ఉన్నప్పటికీ, మీకు ఇల్లు ఉన్నప్పటికీ, దేహం ఉన్నప్పటికీ, మీకు బంధువులు ఉన్నప్పటికీ, మీకు స్నేహితులు ఉన్నప్పటికీ, మీకు ఎన్నో గౌరవాలు ఉన్నప్పటికీ, మీరు జ్ఞానం సంపాదించ లేనప్పుడు ఒకటి లేని సున్నలు అన్నాడు రమణస్వామి.

ప్రారబ్ధాన్ని బట్టి దేహం నడుస్తూ ఉంటుంది. నీకు కష్టం రావచ్చు, నీకు సుఖం రావచ్చు. ప్రారబ్ధాన్ని బట్టే దేహం నడుస్తూ ఉంటుంది. నీ మొఖం సూర్యుడి వైపు ఉంటే నీ నీడ నీకు కనిపిస్తుందా? కనపడదు. అదే విధంగా మీ మనసు కనుక ఆత్మ వైపుకి ఉంటే మీ ఒంటి మీద కష్టం ఉండవచ్చు, మీ ఒంటి మీద సుఖం ఉండవచ్చు. మీ దేహయాత్ర మాములుగా సాగిపోతూ ఉంటుంది కాని వాడికేదో కష్టం వచ్చినప్పటికీ ఆ కష్టం కష్టంగా కనిపించదు. మనం అందరం లోకాన్ని చింతిస్తున్నాం. లోకాన్ని చింతిస్తే జ్ఞానం రాదు. సత్యాన్ని చింతిస్తే జ్ఞానం కలుగుతుంది. మీ అందరికి నిజం కంటే అబద్ధం ఎక్కువ స్వీట్‌గా

ఉండవచ్చు. మీరు అందరూ నమ్మవచ్చు, నమ్మటం అనేది వేరే విషయం. మీరు నమ్ముతున్నారు కాబట్టి ఒక అబద్ధం నిజం అవ్వదు. అందుచేత ప్రశాంతమైన హృదయం తోటి శాంత చిత్తం తోటి మనకున్న అర్హతను బట్టి మనం పనులు చేసుకుంటూ వెళ్ళాలి. తరువాత దాని యొక్క మంచి చెడ్డలు భగవంతుడు నిర్ణయిస్తాడు. తీర్పు చెప్పవలసింది భగవంతుడే, మనం కాదు. మనం చేసే పని గొప్పల కోసం చేయకూడదు. గొప్పల కోసం ఏ విషయంలోకి మనం వెళ్ళకూడదు. గొప్పల కోసం వెళితే తిప్పలు తప్పవు. భక్తి కూడా మీరు ఆడంబరం కోసం చెయ్యద్దు. భక్తి నీకు ఉన్నట్టు నీ పక్కవాడికి తెలియవలసిన పని లేదు. భక్తి అనేది నీకు భగవంతుడికి ఉన్న సంబంధం. భగవాన్ చెప్పారు అబద్ధానికి ప్రచారం ఉండాలి కాని నిజానికి ప్రచారం అక్కర్లేదు. అందుచేత ఈశ్వరుడిని ఆలంబన చేసుకుని ఈశ్వరుడి యందుపూర్తిగా ప్రేమ పెంచుకుని ఈశ్వరుడి పట్ల మనం ఇష్టాన్ని పెంచుకుని ఈశ్వరుడి కోసమే మనం జీవిస్తుంటే ఈశ్వరుడి కరుణ మన మీద వర్షిస్తుంది. దానితోటి మన జీవితాలని సుఖమయం చేసుకుంటాం, జ్ఞానాన్ని పొందుతాము.

ఒక విషయం మీరు మరచి పోకండి. భక్తి మనదే, శ్రద్ధ మనదే, శక్తి మనదే. ఈ సీక్రెట్ మీ హృదయంలో పెట్టుకోండి. భగవంతుడు ఒక మాట చెప్పాడు. ఆ మాటను పట్టుకుని కొంతమంది బాగు పడుతున్నారు. అదే మాట చదివినప్పటికీ కొంతమందికి బుర్రకి ఎక్కటం లేదు, బాగు పడటం లేదు. మాట భగవంతుడిదే. మాటను నమ్మటంలో ఉన్న శ్రద్ధ ఆ మాట యందు శక్తి, ఆ మాటను అర్థం చేసుకునే బుద్ధి మీదే. శక్తి మీది, శ్రద్ధ మీది, బుద్ధి మీది, మాట ఎవరిది? భగవంతుడిది. ఇది మీరు జ్ఞాపకం పెట్టుకోండి. స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండండి. స్నేహాలు మంచిస్నేహాలు ఉండాలి. మలయాళస్వామి వారు చెబుతూ ఉండేవారు రాత బాగున్న వాడికి గీత చేతిలోకి వస్తుంది అని, లేకపోతే ఎవరు చెప్పినా చదవరు. వాడికి శ్రద్ధే కలగదు. శ్రద్ధ లేకపోతే జ్ఞానం లేదు. నిర్వాణ స్థితిని, మోక్ష స్థితిని మీరు ఇప్పడే పొందాలి, ఇక్కడే పొందాలి, ఈ జన్మలో చేయనప్పడు వచ్చే జన్మలో ఏమి చేస్తారు? ఈ జన్మలో మీరు చెయ్యలేరు అనుకోండి రాబోయే జన్మలో చేస్తారు అని నిర్ధారణ ఎక్కడ ఉంది అన్నారు భగవాన్. ఇవాళ చేయలేని పని రేపు చేస్తారు అని నిర్ధారణ ఎక్కడ ఉంది? సమస్యను పరిష్కరించుకోవడం కోసం ప్రయత్నం చెయ్యండి. Escape అవ్వడానికి మీరు చూడవద్దు. ఇవాళ మీరు చదవటం లేదు, రేపు చదువుదాం అనుకుంటారు. రేపు మటుకు చదువుతారు అని నిర్ధారణ ఎక్కడ ఉంది? ఈ జన్మలో మీరు మోక్షాన్ని సాధించలేకపోతే రాబోయే జన్మలో మీరు సాధిస్తారు అని ఎక్కడ ఉంది? మీరు ఇంటికాడ ఉండి చేయలేని పని ఎక్కడో హిమాలయ పర్వతాలకు

వెళ్లి మీరు చేస్తారా? మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడే మీరు సాధించలేని పని, మీకు పరిస్థితులు వ్యతిరేకంగా ఉన్నప్పుడు మీరు సాధిస్తారా అసలు? మీకు దేహం ఉండగానే మీరు చేయలేని పని దేహం పడిపోయిన తరువాత చేస్తారు అని ఎక్కడ ఉంది? అంటే ఈ జన్మలో మీరు చేయలేకపోతే ఎప్పుడు చేస్తారు? ఈ కాలంలో మీరు చెయ్యలేకపోతే ఏ కాలంలో మీరు చేస్తారు? వర్తమానకాలాన్ని మీరు విడిచి పెట్టుకుని భవిష్యత్తు గురించి ఆలోచించి ఎందుకు మీరు టైం పాడు చేసుకుంటారు? మీ వర్తమాన కాలాన్ని మీరు సద్వినియోగం చేసుకోండి. భవిష్యత్తు దాని జాగ్రత్త అది పడుతుంది. మీరు భూత కాలం గురించి బెంగ పెట్టుకోకండి. భవిష్యత్తు గురించి అస్తమాను ప్లాన్స్ వేస్తూ కూర్చోకండి. వర్తమాన కాలంలో సజీవంగా జీవించండి. మీరు తప్పనిసరిగా బాగు పడతారు. ఈ అవకాశాన్ని మీరు ఉపయోగించుకోండి. ఈ జన్మను మీరు ఉపయోగించుకోండి. ఈ జన్మను ఉపయోగించు కోవడం మానేసి రాబోయే జన్మను గురించి ఆలోచిస్తే కాలాన్ని మీరు పాడు చేసుకున్నట్టు అవుతుంది. అక్షరమణమాల నెపం తోటి మనకి తెలియని విషయాలు అనేక విషయాలు మనకి భగవంతుడు చెబుతున్నాడు. రమణస్వామి కూడా ఈశ్వరుడే. అరుణాచలేశ్వరుడు ఈ రూపంలో వచ్చాడు. భగవంతుడు కూడా ఒక మాట చెప్పాలి అంటే వాడికి దేహం ఉండాలి. అందుచేత దేహం ధరించి వచ్చాడు. ఒకసారి డాక్టరు రాధాకృష్ణన్ చెప్పాడు. రక్త మాంసాలలో దేవుడు ఎలా ఉంటాడో నువ్వు చూడాలని అనుకుంటే, If you want to see God in flesh and blood, see Ramana Maharshi అన్నాడు. ఎదుటి మనిషి ఎంత greatman తెలియాలి అంటే ఆ greatness మన హృదయంలో కూడా కొంత ఉండాలి. లేకపోతే ఎదుటి వాడు ఎంతటి వాడు అయినా మనకు తెలియదు.

దేవతారాధన పనికి రాదని కొంతమంది చెబుతారు. దేవుడు గుడిలోకి వెళ్లి విగ్రహారాధన చేయటం తప్పు అని కొంతమంది అనుకోవచ్చు. అసలు విగ్రహారాధన చేయని మనిషి ఈ లోకంలో ఎవడైనా ఉన్నాడా? అని రమణమహర్షి అడిగారు. దేహం ఒక విగ్రహం. దీనికి రోజు అన్నం పెడుతున్నారు, దీనికి రోజు స్నానం చేయిస్తున్నారు, దీనికి రోజు తల దువ్వుతున్నారు, దీనికి ఎంతో సదుపాయాలూ చేస్తున్నారు. దేహం ఒక విగ్రహం, దేహ ఆరాధన చెయ్యని వాడు ఎవడైనా ఉన్నాడా? ఎవడి దేహాన్ని వాడు ఆరాధించు కోవటం లేదా? అది విగ్రహారాధన కాదా? మనం దేహం గురించి ఆలోచిస్తాం, ఈ దేహాన్ని అలంకరించు కోవటం కోసం, ఈ దేహాన్ని పోషించు కోవటం కోసం ఈ దేహాన్ని అందంగా కనిపించేటట్టు చేసుకోవడం కోసం, మనం కాలాన్ని ఖర్చు పెడుతున్నామా? జ్ఞానం కోసం ఖర్చు పెడుతున్నామా మనం?

ఏ మనిషి ఏ వృత్తిలో ఉన్నప్పటికీ ఎవడి అహంకారాన్ని వాడు సంతృప్తి పరుచుకోవడం కోసం మానవుడు జీవిస్తున్నాడు. దేవుడు కోసం జీవిస్తే వాడికి తప్పనిసరిగా జ్ఞానం కలుగుతుంది. జీవుడు జీవించేది దేవుడు కోసం కాదు. అహంకారం కోసం జీవుడు జీవిస్తున్నాడు. వాడి అహంకారాన్ని ఉబ్బించు కోవటం కోసం, వాడి అహంకారాన్ని satisfy చేసుకోవటం కోసం ప్రతీ మానవుడు జీవిస్తున్నాడు. అందుకే అన్నం తింటున్నాడు, అందుకే మాట్లాడుతున్నాడు, అహంకారం కోసమే మనిషి పని చేస్తున్నాడు. దేవుడి యొక్క సంతోషం కోసం నువ్వు పని చేస్తున్నావా? లేకపోతే నీ యొక్క అహంకారం కోసం నువ్వు పని చేస్తున్నావా? నువ్వు ఎవరిని మోసం చేస్తావు అది నీకు తెలియదా? నువ్వు ఒక సత్రం కడితే ఎందుకు కట్టావో నీకు తెలియదా? నీ పేరు కోసం కట్టావా? దేవుడు సంతోషిస్తాడు అని కట్టావా లేక సమాజాన్ని ఉద్ధరించడం కోసం కట్టావా? నువ్వు ఎవరిని మోసం చేస్తావు?

ఈ లంకలకోడేరు ఏమి అయిపోతుంది అని మీరు ఎవరూ కంగారు పడవద్దు. మనం అందరం లంకలకోడేరు చూస్తాం, పాలకొల్లు చూస్తాం, మళ్ళీ సినిమాలకి వెళ్ళవచ్చు. సాధన అనేది మనం కొత్తగా తెచ్చి పెట్టుకోవడానికి కాదు. ఏదైతే మన స్వరూపాన్ని తెలుసుకోవటానికి అడ్డు వస్తుందో, ఆ అడ్డు వచ్చే రుగ్మతను, అడ్డు వచ్చే కల్మషాన్ని తొలగించుకోవటం కోసమే సాధన. భగవంతుడిని తెలుసుకోవటానికి ఏ విషయాలు అయితే మనలో అడ్డుగా ఉన్నాయో, ఆ అడ్డుగా ఉన్న విషయాలను తొలగించుకోవటం కోసమే సాధన. వస్తువు మనలో రెడీగానే ఉంది, మీరు సంపాదించటం వల్లే ఆ వస్తువు వస్తే తర్వాత ఎప్పుడో ఒకప్పుడు పోతుంది. అది మీరు సంపాదిస్తే వచ్చేది కాదు. అది ఎప్పుడూ సిద్దంగానే ఉంది. ఆ సిద్దంగా ఉన్న వస్తువును ఎవడైతే తెలుసుకున్నాడో వాడే సిద్ధుడు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.


# భక్తికి ఫలం నరసింహావతారం

**(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణముల నుంచి సేకరణ)**

నరసింహస్వామి తన భక్తుడైన ప్రహ్లాదుని రక్షించటం కోసం అవతారం ధరించాడు. ప్రహ్లాదుడి తండ్రి హిరణ్యకశపుడు అహంకారి. దేవుడికి, నారాయణుడికి, వ్యతిరేకి. దేవుడు ఎక్కడ ఉన్నాడు అని రోజూ ప్రహ్లాదుడిని అడిగేవాడు. దేవుడు ఎక్కడ లేడు (అంటే దేవుడు లేని చోటు ఎక్కడుంది) అని ప్రహ్లాదుడి సమాధానం. ఇదే పేచీ వాళ్లకి!

ప్రహ్లాదుడిని మార్చటానికి చాలా ప్రయత్నాలు చేసాడు, చాలా బాధలకి గురి చేసి, చివరికి వాడిని చంపుదామని నిర్ధారణకి వచ్చాడు. కానీ ప్రహ్లాదుడి భక్తి ముందు అవన్నీ విఫలమయ్యాయి. హిరణ్యకశపుడు ఓటమిని అంగీకరించలేదు. చాలా ప్రయత్నాలు చేసాము ఈ ప్రహ్లాదుడిని చంపటానికి కాని వీడు చావలేదు. వీడిలో ఏదో విశేషముంది మర్యాదగా మాట్లాడి లోబరుచుకుందాము అనుకొన్నాడు. దగ్గరకి తీసుకొని ఏమిటి నువ్వు దేవుడు అంటావు, నారాయణుడు అంటావు, విష్ణువు అంటావు, ఎక్కడ ఉన్నాడు ఆ విష్ణువు అని అడుగుతాడు. భగవంతుడు ఉన్నాడు ఉన్నాడు అంటున్నావు కదా, ఎక్కడ ఉన్నాడు అని ప్రశ్న హిరణ్యకశపుడిది. ప్రహ్లాదుడు మళ్లీ అదే సమాధానం - ఎక్కడ లేడు, ఎక్కడ లేడు అంటున్నాడు (అంటే భగవంతుడు లేని చోటెక్కడ అని!). అప్పుడు ఆ పక్కన స్థంభం ఉంటే, ఇక్కడ ఉన్నాడా అని ఆ దగ్గరున్న స్తంభాన్ని తన్నుతాడు హిరణ్యకశిపుడు. అక్కడినుంచి నరసింహస్వామి వచ్చాడు. అంటే ఆ స్థంభంలోనే భగవంతుడు ఉన్నాడు ఇంక ఎక్కడా లేడని కాదు. అన్ని చోట్లా ఉన్నాడు ఆ స్థంభంలో కూడా ఉన్నాడు. ఆయన ఎక్కడ లేడు, అన్నిచోట్ల ఉన్నాడు అని ప్రహ్లాదుడు అన్న మాటని, భక్తుడు చెప్పిన మాటని, గౌరవించటం కోసం, ఏ స్తంభాన్ని అయితే హిరణ్యకశిపుడు తన్నాడో, ఆ స్తంభంలో నుంచే నరసింహ స్వామి వచ్చాడు.

ఇక్కడ మనము గ్రహించవలసినది ఏమిటంటే ప్రహ్లాదుడి మాటలని పోషించటం కోసం, భక్తుడి మాటలని పోషించటం కోసం, నరసింహస్వామి అవతరించాడు. అందుచేత మనం భగవంతుడి పట్ల సజీవమైన విశ్వాసం పెంచుకోవాలి. ప్రహ్లాదుడికి ఎంత విశ్వాసం ఉందో, నారాయణుడి పట్ల మనం కూడా అంత సజీవమైన విశ్వాసం పెంచుకోవాలి. కొంతమంది భగవంతుడి పేరు ఎత్తకపోయినా భక్తులకి చాలా సేవ చేస్తారు. ఈ భక్తులకి చేసే సేవ కూడా భగవంతుడికే అలంకరించబడుతుంది. ఇది గుర్తు పెట్టుకోండి. భక్తులందరూ భగవంతుడిలో ఉంటారు. అందుచేత మీరు భక్తులతో కనుక ప్రేమగా మాట్లాడితే, భక్తులకి కనుక సేవ చేస్తే భగవంతుడు అలంకరించబడతాడు. భక్తులకి మనం చేసే సేవ వల్ల, భక్తులు అలంకరించబడు తున్నారని మనం అనుకుంటాము, కాని భగవంతుడు అలంకరించబడతాడు. అహంకారికి మనం గౌరవం చేస్తే అతని అహంకారమే అలంకరించబడుతుంది. అహంకారం లేనివాడికి మనం చేసిన గౌరవం ఈశ్వరుడికే అలంకరణ.



# అరుణాచల మహత్మ్యం
# అక్షరమణమాల

**నొవ్వగింపక నిన్ను నొసగినన్ గొనలేదె**
**యంతకుడవు నాకు అరుణాచలా । 62 ।**

**తాత్పర్యము:** సాధనల పేరుతో నన్నేమీ శ్రమ పెట్టకుండానే నీ జ్ఞానాన్ని నాకు ప్రసాదించి, నా అజ్ఞానాన్ని హరించి, అహంకారాన్ని హతమార్చావు అరుణాచలా!

నొవ్వగింపకను, నిన్ను ఒసగి, నన్ను గొనలేదె - రమణస్వామి ఏమైనా సత్సంగాలు విన్నాడా, ఎప్పుడైనా ఉపవాసాలు చేసాడా, యాత్రలు చేసాడా, లేకపోతే మంత్రాలు చేసాడా? ఏమీ చేయలేదే. సాధనలు చేయలేదు, నామం చేయలేదు. హరి నామస్మరణ కాని, శివ స్మరణ కాని ఏమీ చేయలేదు. ఆయన చేయలేదు అంటే మనల్ని సాధనలు చేయవద్దు అని కాదు. ఓ అరుణాచలేశ్వరుడా! నన్నేమైనా సాధనలు చేయమన్నావా, ఏమైనా కష్టపెట్టావా! ఏమీ బాధపెట్టకుండా, నా అహంకారాన్ని తీసేశావు అంటున్నారు రమణస్వామి. ఓ అరుణాచలేశ్వరుడా బాధ అనేది ఎలా ఉంటుందో నాకు తెలియకుండా, సాధన యొక్క భారం కూడా నాకు లేకుండా చేసావు. నేనేమీ సాధన చేయలేదు, కష్టమనేది ఎలా ఉంటుందో నాకు తెలియదు. నేను ధ్యానం చేయలేదు, ఏమీ జపం చేయలేదు, నామం చేయలేదు. ఏ రకమైన నొప్పి లేకుండా, కించిత్తు కూడా బాధపెట్టకుండా - నొవ్వగింపక - మానసికముగా కూడా నన్నేమీ హింస పెట్టకుండా, అనుగ్రహించావు. నువ్వు ఈ పని చెయ్యి ఆ పని చెయ్యి, ఇంతకాలం నామం చెయ్యి, ఇంతకాలం ధ్యానంలో కూర్చో, పద్మాసనంలో కూర్చో, ఇలా ఆసనాలు ఎక్సర్‌సైజులు ఏమీ లేకుండా, ఏమీ కష్టపెట్టకుండా, ఏమీ బాధపెట్టకుండా నా అహంకారాన్ని తీసేశావు అరుణాచలా! ఏ దేవతలు అనుగ్రహించారో మనకి తెలియదు ఈ రహస్యం! మన అహంకారం లోనుంచి బయటపడటం కోసం మనమెన్నో బాధలు పడుతున్నాము! ఎంత సాధన చేసినా, ఎంత కష్టపడ్డా లోపలినుంచి తొంగి చూస్తానే ఉంటుంది అహంకారం. అంచేత మనస్సు విషయములో బహు జాగ్రత్తగా ఉండాలి. జీవలక్షణాలు నశించకుండా మరణిస్తే, మామూలు శరీరమే, మామూలు ముసలితనమే, మామూలు రోగమే, మళ్ళీ మామూలు మరణమే!

శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**
**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**
IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# ఆధ్యాత్మికత - గమ్యం

వాస్తవంగా నీవెవరివో తెలుసుకో అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి. మానవునికి తాను ఎవరో తెలుసుకోవలసిన అవసరం ఏమిటి? అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటి? అసలు నేను ఎవరిని అని విచారణ చేస్తే స్వరూపంగా ఆత్మనైన నేను భావన రీత్యా ఒక వ్యక్తిగా విడివడడం జరిగింది. మనిషి తన పూర్వ పూర్ణస్థితిని తానుగా, నేనుగా అనుభవైకవేద్యం చేసుకోవడమే ఆధ్యాత్మికత పరమగమ్యం. ఆధ్యాత్మికత అంటే ఉన్న దానిని ఉన్నట్లుగా చూడడం, నన్ను నేను చేరడం. దానికి అంతర్ముఖ ప్రయాణమే శరణ్యం, దానినే లోచూపు అంటారు. మానవునికి వాస్తవంగా తాను ఎవరో అనుభవైకవేద్యం అయితే జగత్తు అంటే ఏమిటి? దైవం అంటే ఏమిటి? అన్నది అనుభవమవుతుంది. "నిన్ను నీవు చూడగలిగితే అన్నింటిలోనూ నన్నే చూడగలవు" అన్నారు కృష్ణ పరమాత్మ. కేవలం ఉన్నదే పరమాత్మ, వ్యక్తి అనేది కేవలం భావన మాత్రమే! సూర్యుడు ఉదయించగానే అంధకారము అంతరించినట్లు, వాస్తవంగా తాను ఎవరు అన్న సత్యంలోకి మేల్కొనగానే అహంకారం నశిస్తుంది. అహంకారం నశించిన స్థితియే అమృతత్త్వము. అనంతమైన ఆత్మ దేహ పరిమితిలో, దేహంతో తాదాత్మ్యత నొంది, జీవుడిగా, కర్తగా, భోక్తగా, జనన మరణాలకు లోనవుచున్నవాడిగా భ్రాంతి నొందుతున్నాడు. కాబట్టి దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందితే, బ్రహ్మము తానుగా అనుభవైకవేద్యం అవుతుంది. జీవుడనియు, ఈశ్వరుడనియు భేదము శబ్ద మాత్రమే గానీ వస్తు భేదము లేదు. జీవేశ్వర భేదము మాయా కల్పితము. ఉన్నది కేవలం బ్రహ్మమే! ఉన్నది పూర్ణము, దేశ కాలాతీతము, సకలమునకూ ఆధారము, సకలమునకు అధిష్ఠానము. కాబట్టి లేని దానిని లేనట్లు చూడగలిగితే, ఉన్నది ఉన్నట్లే ఉంటుంది. చీకటి, వెలుతురు కలిసి ఉండలేవు, అదేవిధంగా జ్ఞానము అజ్ఞానము కలిసి ఉండలేవు. కాబట్టి అహంకారానికి మోక్షం కాదు, అహంకారం నశించిన స్థితే మోక్షం, అదే స్వరూపం! అందువల్లే "అహమపేతకం నిజ విభానకం మహదిదం తపో రమణ వాగియం" అన్నారు భగవాన్ శ్రీరమణమహర్షి ఉపదేశసారంలో. శాశ్వతమైన జీవితం కావాలంటే అహంకారం మరణించాలి. "అహంకారం లేకుండా జీవించడమే తపస్సు" అన్నారు సద్గురు శ్రీనాన్నగారు. ఆధ్యాత్మిక సాధనకు పునాది నిత్యానిత్య వివేకము.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# భేదాలు ఉన్నంతకాలం బాధలు తప్పవు

ఉన్నది ఆత్మ ఒక్కటే కాని నేను వేరు నా కన్న భిన్నంగా కనిపిస్తున్నవి అన్నీ వేరు ఈ భావనే దేహాత్మబుద్ధి. దీనికి అసూయ, స్వార్థం, ద్వేషం, క్రోధం హింసలాంటి వెయ్యినొక్క దుర్మార్గపు వికారాల సమ్మేళనంతో ఉంటుంది. కామం (కోరిక) జ్వరం లాంటిది. బుద్ధభగవానుని ఒక మతోన్మాది తను చేసిన ఉన్మాదచర్యకు క్షమాపణ కోరగా బుద్ధుడు "ఆనందా! ఈతని కళ్ళు క్షమాగుణంతో నీరుకారుతున్నాయి. నిన్న ఈతని కళ్ళు అగ్ని వర్షింపచేసాయి నన్ను చంపాలనుకొన్నాడు. అతడూ ఈతడూ ఒక్కడేనంటావా?" అన్నాడు. ఏ వ్యక్తి నిరంతరం క్రింద క్షణంలో ఉన్నట్లు ఉండడు అని తెలుసుకోవటమే తెలివి. న్యాయమార్గాన్ని నడిచేవారు చాలా తక్కువ. ప్రమాద పూర్వకంగా సాగటం తేలికే. మూఢులు అలా చేస్తారు. కష్టసుఖాల్లో ఏది సంభవించినా దేనికీ బాధ్యత వహించరు. బాధ్యతలు అదృష్టంపైనో, దేవునిపైనో, సమాజంపైనో, ఆర్థిక విశేషణపైనో, తల్లిదండ్రులపైనో నిరంతరం చెబుతారు. ఏ ఒక్కడూ "మనలను దుఃఖితుడిగానో ఆనందించే వాడిగానో చెయ్యలేడు. మన దుఃఖాలకు, మన ఆనందాలకు మన పూర్వకర్మలే కారణం. మనం చేసిన పాపానికి ఫలితమే దుఃఖం అయి ఉండాలి అని గ్రహించాలి. మూఢుని ఆనందం ఆతని పాపాలు ఎదురు తిరిగేంతవరకే, పుణ్యాత్ముడు దుఃఖం ఆతని పుణ్యాలు పూసే వరకూ ఉంటుంది. దుఃఖితుడు తన తప్పు గ్రహించి సత్‌ప్రవర్తనలోకి వచ్చి పశ్చాత్తాపాలతో తిరిగి చెయ్యనని లెంపలేసుకోవటంతో తెలిసిపోతుంది. కాని గతం గతః. దాన్ని గురించి ఆరాటపడవలసినది ఏమీలేదు. తిరిగి కోపకారణం ఎదురైనా స్మృతి పూర్వకంగా సాగిపోనివ్వాలి. జాగ్రత్తగా గ్రహింపుతో ఉండాలి. కోపానికి, హింసకు మూలకారణం భయం. పరువు తీస్తాడనో, ఎదురు తిరగకూడదనో కారణం దాగి ఉంటుంది. నిజానికి అందరిలోనూ ఉన్న మూల పదార్థం ఆత్మే. ఉపాధి బేధాలు నిజమనుకోవటం వల్ల వచ్చే అనర్థాలు ఇవి. మనలను మనం సంస్కరించుకోవాలి. ఇతరులను కాదు. మంచి చెడ్డల చర్చల రచ్చలో పాల్గొనకూడదు. మన దుఃఖానికి, దైన్యానికి గల మూలకారణం గ్రహించాలి. జనం అనేక రకాలుగా ఉంటారు. వారి భిన్నత్వాన్ని వైవిధ్యాన్ని అనంతమైన ఓర్పుతో పరిశీలించి ఉదాసీనంగా ఉండాలి. మన నిశ్చయాలతో ఎవ్వరినీ మార్చలేము. అసలు మనం ఎవరము మార్చటానికి. సాధకుడు ఏకాంతవాసం చెయ్యాలి. తలంపుకూ తలంపుకూ మధ్య ఉన్న సమయాన్ని గుర్తించాలి. ఇది ప్రయాస పూర్వకంగా కాకుండా ఆనందకరమైన ఆటగా ఉల్లాసంగా సాగించాలి. వైరంలేని వైపు ప్రవహింపచెయ్యాలి. అలాగే విషయాలు వలయాకారంలో ఒకదాని వెంట మరియొకటి జతకట్టి తిరుగుతూ ఉంటాయి. సాధకుడు దాన్ని స్వస్తిపలకాలి పిల్లచేష్టగా. మన ఉద్దేశ్యం దాన్ని దాచటం మంచిదికాదు. ఎవ్వరూ కూడా దేన్ని వదులుకోలేరు. కుటుంబ బంధాన్ని చూపిస్తాము కాని తటస్థంగా చూస్తూ ఉండాలి. కొత్త ఉన్నతస్థితికి చేరిన తరువాత తానుగానే అది మాయమవుతుంది. చిన్నప్పుడు బొమ్మలతో ఆడుకొంటాము, ఎదిగాక వదిలేస్తాము. అలాగే కుటుంబ మమకారాలు పరిణతి దశలో చిన్నవాటివైపోతాయి. అంతకన్న ఏమీ కాదు. స్వేచ్ఛలోనే ఆనందం ఉంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**